



స్టాప్ డయేరియా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

డయేరియా అరికట్టాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : డయేరియా మరణాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం స్టాప్ డయేరియా క్యాంపెయిన్ - 2025 పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు.జూలై 31వ తేదీ వరకూ ఈ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పెద్ద ఎత్తున జరుగుతున్నదన్నారు. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా మరణాలను పూర్తిగా అరికట్టడమే ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 1,28,495 మంది ఉన్నారని తెలిపారు. డయేరియా పట్ల తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు.



షా..క్యూ..

తల్లికి వందనం స్కీమ్‌కు విద్యుత్ షాక్ కొట్టింది.. ఆ షాక్ సరిచేసు కునేందుకు పలువురు తల్లులు క్యూకట్టారు. ఇటీవల కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో తల్లుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసిన సంగతి తెలిసిందే. అయితే కొంతమందికి కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటడంతో డబ్బులు జమ కాలేదు. కరెంట్ బిల్లులను సరి చేసుకుంటే తిరిగి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఆ బిల్లులు సరి చేసుకునేందుకు ఇలా క్యూ కట్టారు. సోమవారం ఒక్క రోజే గోకవరం మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 100 మందికి పైగా విద్యుత్ బిల్లులు సరి చేయించుకునేం దుకు వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. - గోకవరం

కమిషనర్ కేతన్‌గార్గ్ బదిలీ

- ఆకస్మిక ఉత్తర్వులు
- 11 నెలలే బాధ్యతలు
- విశాఖలో నియామకం

6



జలామృత్!

పట్టణాలకు అమృత్ నిధులు



- తీరనున్న తాగునీటి వెతలు
- పట్టణాల్లో ప్రాజెక్టులకు మోక్షం
- ఉమ్మడి జిల్లాకు రూ.867 కోట్లు
- అమృత్ 2.0 పథకంలో మంజూరు
- చామ్ మోడల్‌లో పనులు
- వైసీపీలో నిధులు మళ్లింపు
- మూడు నెలల్లో టెండర్ల పిలుపు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పట్టణాలు,నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుదల, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుల నిర్వహణకు పుష్కలంగా నిధులు విడుదలయ్యాయి. కేంద్రం అమృత్-2.0 పథకం ద్వారా ఇచ్చిన నిధులు సద్వినియోగపరచుకుంటూ రాష్ట్ర వాటా విడుదల చేస్తూ పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థల వాటా విడుదల చేయకపోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీటన్నింటికి తిరిగి అంచనాలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.867.73 కోట్లు నిధులు మంజూరు చేయడంతో మూడు నెలల్లోగా టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అసలేం చేస్తారు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థ పురాతనమైనది. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు చోట్ల ప్రస్తుతం ఉన్న తాగునీటి ప్రాజెక్టుల కెపాసిటీ సరిపోవడం లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడం, పైపులైన్ల ఏర్పాటుతో పాటు మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులు, కొత్తగా మురుగునీటి పారుదల నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు కేంద్రం అమృత్ పథకం ద్వారా నిధులు కేటాయిస్తోంది.ఇందులో కేంద్రంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడంతో పాటు ఈ ప్రాజెక్టులు అమలయ్యే పట్టణ స్థానిక సంస్థలు తమ వాటా భరించాలి. 15వ ఆర్థిక సంఘం నిధులు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది.

కూటమి ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్-2.0 పథకం నిధులు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రంతో సంప్రదింపులు జరిపి తమ వాటా విడుదలకు అంగీకారం తెలపడంతో నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు కార్పొరేషన్లు, ఎనిమిది మునిసిపాలిటీలు,మూడు నగరపంచాయతీలకు 867.73 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ వాటర్ యాక్షన్ ప్లాన్ (ట్రెంచ్ 1,2 ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(చామ్)లో నిర్వహించేందుకు ఆదేశాలివ్వడంతో అన్ని పనులు మూడు నెలల్లోగా ప్రారంభించాలని ఆదేశించింది. పనులు 24 నెలల్లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.ఈ పనులు పూర్తయితే పట్టణాలు, నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడి.ప్రజలకు తాగునీరందుతుందని భావిస్తున్నారు.

వైసీపీలో ఎక్కడివి అక్కడే..

వైసీపీ ప్రభుత్వం అమృత్-2.0 పథకం నిధులు వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అమృత్ నిధులు కేంద్రం మంజూరు చేసింది. దీంతో పట్టణాలు,నగరాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి వీలు ఏర్పడుతుందని భావించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోగా కేంద్రం ఇచ్చిన నిధులు ఇతర అవసరాలకు దారి మళ్లించారు. మంజూరైన పనుల్లో కొన్నింటిని మా త్రమే ప్రారంభించారు.వాటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడం,స్థానిక సంస్థల నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవడంతో పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. మెజార్టీ పనులు ప్రారంభమే కాలేదు.

కాకినాడకు రూ.498.16 కోట్లు

కాకినాడ జిల్లాకు రూ. 498.16 కోట్లు విడుదలయ్యాయి. పిఠాపురం పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.57.37 కోట్లు, పెద్దాపురం పట్టణ పరిధిలో నీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 36.21 కోట్లు, తిరుపతిరాజు చెరువు ఆధునీకరణకు రూ.61 లక్షలు, పాత ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పెద్ద చెరువు ఆధునీకరణకు రూ.90 లక్షలు, సామర్లకోట పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ. 38.98 కోట్లు, గొల్లప్రోలు పట్టణంలో ఆర్థికంగా వెనుకబడిన కాలనీల తాగునీటి సరఫరా పథకానికి రూ. 2.16 కోట్లు, మంచినీటి చెరువు అభివృద్ధికి రూ.4.10 కోట్లు, తుని పట్టణంలో వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ.15.04 కోట్లు, ఏలేశ్వరం నగరపంచాయతీలో కప్పల చెరువు ఆ ధునీకరణకు రూ.74 లక్షలు మంజూరయ్యాయి. కాకినాడ నగరంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ. 256.48 కోట్లు మంజూరు కాగా, నగర పరిధిలో మురుగునీటి పారుదల నిర్వహణకు రూ.82.87 కోట్లు, బోట్‌క్లబ్ పార్కు ఆధునీకరణకు రూ.2.70కోట్లు విడుదల చేశారు.

తూర్పునకు రూ. 296.83 కోట్లు

రాజమహేంద్రవరం,నిడదవోలు మునిసిపాలిటీలకు రూ.296.83 కోట్లు మంజూరయ్యాయి.రాజమహేంద్రవరంలో మురుగునీటి పారుదలకు రూ.92.78 కోట్లు, వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌కు రూ.95.14 కోట్లు, కంబాలచెరువు ఆధునీకరణకు రూ.3.70 కోట్లు,గంటాలమ్మ చెరువు ఆధునీకరణకు రూ.కోటి,గోదావరి వద్ద పనులకు రూ.7.20 కోట్లు, ఆర్యాపురం ట్యాంకు ఆధునీకరణకు రూ.3.20 కోట్లు విడుదలయ్యాయి. నిడదవోలుకు ధవళేశ్వరం నుంచి గోదావరి జలాల సరఫరాకు రూ.83.82 కోట్లు, నిడదవోలు వీకర్ సెక్షన్ కాలనీ తాగునీటి సరఫరాకు రూ5.96 కోట్లు, మలకోడు చెరువుకు రూ.93 లక్షలు,వేస్ట్ వాటర్ ట్యాంకు ఆధునీకరణకు రూ. 3.60 కోట్లు మంజూరు చేశారు.

కోనసీమకు రూ.72 కోట్లు

కోనసీమ జిల్లాకు రూ.72.74 కోట్లు కేటాయించారు.అమలాపురం వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 11.51 కోట్లు, రామచంద్రపురం తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.15.20 కోట్లు, రామచంద్రపురంలో చెరువు ఆధునీకరణకు రూ.1.10 కోట్లు,మండపేట వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.29.02 కోట్లు, ముమ్మిడివరంలో తాగునీటి సరఫరా మె రుగుదలకు రూ.15.91 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

పింఛన్.. టెన్షన్!



స్పౌజ్ పింఛన్లకు ఎదురుచూపులు

- ఈ నెల 12న ఇస్తారని వాయిదా
- పంపిణీపై అయోమయం
- 8,541 మందికి అర్హత
- పంపిణీకి రూ.3.41 కోట్లు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క

సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏం చేసినా అందులో ఒక పరమార్థం ఉంటుంది.లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. సూపర్ సిక్స్ హామీల అమల తీరులోనూ ఇదే విధానం అవలంబిస్తున్నారు. ఏ పథకమైనా నిరంతరం కొనసాగాలనే దిశగా ఆలోచన చేస్తున్నారు. స్పౌజ్ పింఛన్ల పంపిణీది అదే పరిస్థితి. 2023 డిసెంబరు నెల ఒకటో తేదీ తర్వాత భర్త చనిపోతే భార్యకు ఎన్టీఆర్ భరోసా పథకం స్పౌజ్ పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 8,541 కొత్త పింఛన్లు మంజూరు చేశారు.ఈ నెల మొదటి వారంలోనే వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల 12వ తేదీకి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటడంతో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తారని ప్రకటించారు. అయితే వాయిదా పడింది.ఇప్పటి వరకూ కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టలేదు.భర్త చనిపోయిన భార్యకు మాత్రమే వితంతు పింఛను ఇవ్వాలని నిర్ణయించింది.ఎప్పుడిస్తారో ప్రకటించలేదు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే ఆ పింఛన్‌ను భార్యకు మంజూరు చేసేందుకు నెలల సమయం తీసు కునేది. ఏళ్లు గడుస్తున్నా ఆ కుటుంబంలోని భార్యకు లేదా ఇతర అర్హులైన బంధువులకు పింఛన్ మంజూరయ్యేది కాదు.. ఏళ్ల తర బడి ఎదురుచూడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వంలో పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఆ మరుసటి నెల నుంచే భార్యకు పింఛన్ ఇస్తున్నారు.2023 డిసెంబర్ ఒకటో తేదీ తరువాత నుంచి భర్త చనిపోయినవారికి కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది.



8,541 మంది ఎంపిక..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 8,541 మందికి కొత్తగా ఈనెల నుంచి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వీరికి నెలకు రూ.4 వేల చొప్పున రూ.3 కోట్ల 41 లక్షల 24 వేలు ప్రతినెలా ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది.ఇలా రాష్ట్రవ్యాప్తంగా 89,788 మంది వితంతువులకు ఈ నెల 12న పంపిణీ చేయాల్సిన పింఛన్లు అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.ఈ నెలలోనే లబ్ధిదారులకు అందజేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాకినాడ జిల్లాలో 3,118 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయగా రూ.1కోటి 24 లక్షల 72 వేలు మేర అదనపు భారం పడనుంది.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,824 మందికి కొత్తగా స్పౌజ్ పిం ఛన్లు మంజూరు కాగా రూ.1 కోటి 12 లక్షల 56 వేలు అదనపు భారం పడనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 2,599 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా రూ.1కోటి 3 లక్షల 96 వేలు అదనపు భారం పడనుంది.



వృత్తి నిపుణుల సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

బీజేపీలోకి వస్తే ఆహ్వానిస్తాం

- ఏపీ అభివృద్ధికి కేంద్రం సాయం
- వికసిత్ భారత్ 2047 లక్ష్యం
- కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైన్ ఓకే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా బీజేపీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు లోబడి పనిచేయడానికి సిద్ధంగా ఉంటే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తాం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రా జెక్టు, రాజధాని అమరావతి పనుల్లో కదలిక మొదలైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ స్వప్నానికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ భాగం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అమరావతి రాజధాని కోసం ప్రపంచబ్యాంకు ద్వారా రూ.15 వేల కోట్లు, హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం సమకూర్చడం జరిగిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అసత్యమన్నారు. లాభాల్లోకి తేవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సౌత్‌కోస్టల్ రైల్వే డివిజన్ వైజాగ్ హబ్‌గా త్వరలో ఏర్పాటు కానుందన్నారు. భద్రాచలం-కొవ్వూరు 151 కిలోమీటర్ల రైల్వేలైను ఇప్పటికే మంజూరైందని, దువ్వాడ - రాజమహేంద్రవరం రైల్వే లైను డబ్లింగ్ చేపట్టడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి కాశీ, బెనారస్, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు నడపాలంటూ ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని అధికారులు చెప్పారన్నారు. ప్రస్తుతం తాను కామన్వెల్త్ ఉమెన్ పార్లమెంట్ ఇండియన్ చాప్టర్‌కు చైర్మన్‌గా, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా ఉన్నానని వెల్లడించారు. ఇటు రాజమహేంద్ర వరం పార్లమెంట్ చూసుకుంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నానన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా రాష్ట్రాలు, జిల్లాలు, నగరాలు, పట్టణాలు, గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతోనే ప్రధాని మోదీ పాలన చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మన జవాన్ల శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రం ప్రతిపాదించిన నదుల అనుసంధానాన్ని సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారన్నారు.సమావేశంలో జీఎస్ఎల్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, సాయి హాస్పటల్స్ అధినేత కె.విజయకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జిల్లా ఇన్‌చార్జి భగవాన్,నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, కంటిపూడి సర్వారాయుడు,నర్సిపల్లి హారిక, వీరా వీరాంజనేయులు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.

పనులు కుంటుబడి!

పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన పనులు

- నాడు 4137 పనులు మంజూరు
- పూర్తయినవి 382 పనులు
- అసంపూర్తిగా మిగిలినవి
- బడుల ఎదురుచూపులు



కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణ పనులు

కొవ్వూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.. విద్యార్థులు తరగతులకు వెళుతున్నారు..కానీ సమస్యలు మాత్రం తీరలేదు..నేటికి తొంగి చూస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ పనులు నేటికీ అసంపూర్తిగా మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మన బడి - మన భవిష్యత్ పథకంలో భాగంగా అసంపూర్తిగా నిలిచిపోయిన పనులపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడల నిర్మాణం, మరుగుదొడ్లు,తాగునీరు, విద్యుద్దీకరణ, పెయింటింగ్, ఇంగ్లీష్ ల్యాబ్ వంటి 9 రకాల పనులు మంజూరు చేసి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీల భాగస్వామ్యంతో పనులు చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలలకు నిధులు విడుదల చేసినప్పటికి వాటిని ఏవిధం గా ఖర్చు చేయాలని విధివిధానాలు రూపొందించలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

వేసవి సెలవులు పూర్తయినా..

వేసవి సెలవులు పూర్తి కావడంతో గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ ఆదేశించింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 655 పాఠశాలల్లో రూ.259.10 కోట్లు అంచనా వ్యయంతో 4137 పనులు మంజూరు చేశారు. వాటిలో రూ. 131.59 కోట్లు ఖర్చు చేసి 382 పనులు పూర్తి చేశారు. 2903 పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.852 పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కొవ్వూరు మండలంలో 34 పాఠశాలల్లో రూ.11.12 కోట్లు అంచనా వ్యయం తో 194 పనులు మంజూరు చేశారు. వాటిలో 163 పనులు ప్రారంభించారు. గతేడాది కాల ంగా అవి వివిధ దశల్లో పనులు నిలిచిపోయా యి. ఇంకనూ 31 పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. పనులు చేపట్టడానికి నిధు లు విడుదల కాకపోవడంతో 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్‌కు 6 నెలల ముందు నుంచే ప నులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలో అయినా అసంపూర్తి పనులకు నిధులు మంజూరు చేసి 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేస్తారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు భావించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో నిలుపుదల చేసిన పనులకు త్వరితగతిన నిధులు మంజూరుచేసి పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమస్య వింటున్న డీఆర్‌వో సీతారామమూర్తి

పీజీఆర్ఎస్‌కు 177 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 177 అర్జీలు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పీజీఆర్ఎస్‌లో డీఆర్‌వో టి.సీతారామమూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు.గోకవరం మండలం గాదెలపాలెం గ్రామంలో ఇసుకపల్లి చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలు , రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలో వీధి దీపాలు పనిచేయడంలేదని,ధవళేశ్వరం గ్రామంలో భూసమస్య ,పెరవలి మండలం కాపవరంలో భూమి రీసర్వే చేయాలని అర్జీలు వచ్చాయి.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 23 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు ప్రజల నుంచి 23 ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.

వయసు 33 చోరీలు 80

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- పోలీసుల అదుపులో ఇద్దరు
- 43 లక్షల సొత్తు స్వాధీనం
- సిబ్బందికి ఎస్పీ ప్రశంస

రాజమహేంద్రవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చోరీలు చేయడంలో అతను సిద్ధహస్తుడు.. ఎందుకంటే..అతని వయసు 33.. చోరీలు 80... అంతర్రాష్ట్ర దొంగగా ముద్ర.. ఇదీ విశాఖ పట్నం జిల్లా గాజువాక మండలం సింహగిరి కాలనీకి చెందిన బులా నాగసాయి నేరచరిత్ర..17 ఏళ్ల వయసులోనే చోరీల బాటపట్టాడు.. చోరీలు చేయడంలో ప్రావీణ్యత సాధించాడు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసులు అంతర్రాష్ట్ర దొంగ ఆటకట్టించారు.సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు సోమవారం వివ రాలు వెల్లడించారు. పలు కేసుల దర్యాప్తులో భాగంగా పాత నేరస్తుల చిట్టావిప్పితే అం దులో బులా నాగసాయిపై అనుమానం వచ్చిందన్నారు.ఈ మేరకు అతని స్నేహితుడు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన మహ్మద్ సోనూ ఆలీ అహ్మద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. బులా నాగసాయి 2007 నుంచీ దొంగతనాలు చేస్తున్నాడని తెలిపాడన్నారు. నాగసాయి దొంగిలించిన సొత్తును అహ్మద్‌ఖాన్ కొనుగోలు చేయడం, దొంగతనాల్లో సహకరించడం చేస్తాడన్నారు. నిందితుడిపై గాజువాక, వైజాగ్, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరు, ఒంగోలు, అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, కావలి, బెంగళూరు ప్రాంతాల్లో 80 దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. గాజువాక పీఎస్‌లో సస్పెక్ట్ షీట్ ఉందన్నారు.ఇటీవల రాజమహేంద్రవరం ప్రకా శంనగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో నాగసాయి, అహ్మద్ ఖాన్‌ని సోమవారం అరెస్టు చేసి సుమారు రూ.43 లక్షలు విలువైన 465 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదించిన సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్,ఎస్ఐ జి.సతీష్, హెచ్‌సీ వి.నాగరాజు, క్రైమ్ పీసీలు కె.ప్రదీప్ కుమార్,ఎస్.వీరబాబు, వి.దుర్గాప్రసాద్, వి.శివప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు.

డ్వాక్రా మహిళలకు భరోసా



పిల్లల చదువు కోసం తపన పడే తల్లిదండ్రులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ మేరకు 'స్త్రీ నిధి' ద్వారా స్వల్ప వడ్డీకే రుణాలు అందించే కార్యక్రమానికి చర్యలు చేపట్టింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు అతి తక్కువ వడ్డీతో విద్యా రుణాలు అందించే ఏర్పాటు చేస్తోంది.



- పిల్లల చదువుల కోసం 4 శాతం (35పైసలు) వడ్డీకే స్త్రీ నిధి రుణం
- 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'గా అమలు చేయాలని నిర్ణయం
- త్వరలో అందించేందుకు కూటమి సర్కారు సిద్ధం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పిల్లల చదువులు తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి. స్కూలు, కాలేజీ ఫీజుల చెల్లింపు, పుస్తకాలు, యూనిఫామ్ కొనుగోలు, అదనపు కోర్సులు, ఇతరత్రా ఖర్చులు పెరుగుతుండడంతో ఏటా విద్యా సంవత్సరం ప్రారంభంలో వారు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. ఉన్నత చదువులన్నీ దాదాపు ఖర్చుతో కూడుకున్నవే కావడంతో చాలా మంది బయట అధిక వడ్డీలకు అప్పులు చేసే పరిస్థితి ఉంది. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కొత్త పథకానికి శ్రీకారం చుడుతోంది. స్త్రీ నిధి ద్వారా పొదుపు మహిళల పిల్లల చదువు కోసం తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం' పేరిట ఈ రుణాలను అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో కేవలం 35 పైసల వడ్డీకి రెండేళ్ల నుంచి మూడేళ్ల కాలపరిమితిపై అందించనున్నారు. రుణం పొందిన వారు కేజీ నుంచి పీజీ వరకు చదివే తమ పిల్లల విద్య కోసం మాత్రమే దీనిని ఖర్చు చేయాలి. అవసరమైతే వారికి సైకిళ్ల కొనుగోలుకు, చదువుకు సంబంధించి పరీక్ష ఖర్చుకు వినియోగించుకోవచ్చు. అధికారులు అడిగితే ఖర్చుకు సంబంధించిన రసీదులు చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు వర్తింపజేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా త్వరలో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా అధికారులు కసరత్తు పూర్తి చేశారు.

కాకినాడ జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 2,89,779 మంది ఉన్నారు. 38వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులో 38 వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. విద్యార్థుల్లో 80 శాతానికిపైగా పొదుపు సంఘాల పరిధిలోని కుటుంబాల వారే. ఇందులోనూ మూడొంతులకు పైగా పేద, నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. వీరందరూ కూడా తమ పిల్లల చదువుల కోసం స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవచ్చు. జిల్లాలో ఏటా స్త్రీ నిధి ద్వారా 28వేలమంది సభ్యులు రూ.253 కోట్లు వరకు రుణాలు పొందుతున్నారు.

హాయి హాయిగా..



శోభాయమానంగా ఉన్న చెట్లు

- మోతుగూడెంలో ఇరువైపులా పచ్చదనంతో ఆహ్లాదకరంగా రహదారులు

మోతుగూడెం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో చిగురించిన చెట్లతో మన్యం ఆహ్లాదకరంగా మారింది. నాలుగు రోజులుగా వాతావరణ మార్పు.. చిరుజల్లులు పడుతుండడంతో పచ్చదనంతో శోభాయమానంగా మారింది. మోతుగూడెం-గొర్లగూడెం మధ్య రహదారులు ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాహనచోదకులు చల్లటి వాతావరణంలో ప్రయాణిస్తూ చక్కటి అనుభూతి పొందుతున్నారు.

'విసిరి'తే పతకమే!

- షాట్‌పుట్‌లో రాణిస్తున్న కాకినాడ యువతి లక్ష్మీ వేద సంహిత
- సీనియర్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో బంగారు పతకం కైవసం



సాధించిన పతకాలతో లక్ష్మీ వేద సంహిత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ సమీపంలోని పచ్చిపులుసు వారి వీధిలో నివసిస్తున్న పి.చంద్రశేఖరరావు-అన్నపూర్ణ దంపతుల కుమార్తె లక్ష్మీ వేద సంహిత అథ్లెటిక్స్‌లో రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ప్రస్తుతం నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమె మేనత్త కరాటేలో బ్లాక్ బెల్ట్.. అనేక రంగాల్లోనూ ఆమె ఆరితేరారు. అదే స్ఫూర్తితో వేద సంహిత ఆటలపై... ముఖ్యంగా అథ్లెటిక్స్‌పై మక్కువ పెంచుకుంది. ఆరో తరగతి చదివే సమయంలో ఆమె క్రీడల పట్ల చూపిన ఆసక్తి, ఉత్సాహాన్ని గమనించి వ్యాయామ ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు ప్రోత్సహించారు. దీంతో షాట్‌పుట్‌లో రాణిస్తూ పతకాలు సాధిస్తోంది. 2019లో జరిగిన ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న వేద సంహిత తృతీయ స్థానంలో నిలిచింది. 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. 37వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచింది. తాజాగా ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగిన సీనియర్ అథ్లెటిక్స్ స్టేట్ మీట్‌లో షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఒక్క షాట్‌పుట్‌లోనే కాదు.. కర్రసాము, టెన్నిస్‌ల్లోనూ రాణిస్తోంది. పెయింటింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తోంది. అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని వేద సంహిత 'ఆంధ్రజ్యోతి'కి చెప్పింది.



స్టేట్ మీట్‌లో బంగారు పతకం అందుకున్న వేళ

స్టూడెంట్ బస్ పాస్.. తీసుకున్నారా?



- విద్యార్థులూ ఈ నిబంధనలు తెలుసుకోండి?
- కాకినాడ జిల్లా ప్రజా రవాణాధికారి సూచనలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బస్‌పాస్‌ల జారీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా విద్యార్థులు ఆయా జిల్లా కేంద్రాల్లోని కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం బస్‌స్టేషన్‌లోని బస్‌పాస్ కౌంటర్లను సంప్రదించాలని, ఉదయం 8గంటలనుంచి రాత్రి 8గంటల వరకు ఇవి అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు.

విద్యార్థులు.. ఈ సూచనలు పాటించండి

బస్‌పాస్ కావాలనుకునే విద్యార్థులు ఈ కింద సూచనలు పాటించాల్సి ఉంటుంది. విద్యార్థి తన పూర్తి వివరాలతోపాటు ఫొటోతో buspassonline.apsrtconline.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకోవాలి. దరఖాస్తుపై సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ లేదా ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించి స్టాంప్ వేసి దాన్ని సంబంధిత డిపో కార్యాలయానికి సమర్పించాలి. దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా జతచేయాలి. విద్యార్థి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలి. విద్యాసంస్థలు కూడా తరగతుల వారీగా విద్యార్థుల అడ్మిషన్ జాబితాను ప్రిన్సిపాల్/ప్రధానోపాధ్యాయుడి సంతకంతో సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయానికి అందజేయాలి. లేకుంటే ఆ విద్యాసంస్థకు చెందిన విద్యార్థులకు బస్ పాస్‌లు జారీ చేయరు. 12ఏళ్లలోపు బాలురు, 18ఏళ్లలోపు బాలికలు(10వ తరగతి వరకు ఉచిత బస్సు పాస్‌తోపాటు స్టూడెంట్ జనరల్ బస్సు పాస్(సంవత్సరం, త్రైమాసికం/నెలవారీ) పొందవచ్చని ప్రజారవాణా అధికారి తెలిపారు.

రాజమహేంద్రి మునిసిపల్ కమిషనర్ బదిలీ

గ్రేటర్ విశాఖ కమిషనర్‌గా కేతన్ గార్గ్ నియామకం



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్ నెం 1181ను జారీ చేసింది. కమిషనర్ కేతన్ గార్గ్‌ను గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ స్థానంలో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక 2024 జూలై 25న అప్పటి కమిషనర్ దినేష్‌కుమార్‌ను గుంటూరుకు బదిలీ చేసి కేతన్ గార్గ్‌కు రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా కూటమి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కేతన్ గార్గ్ బాధ్యతలు స్వీకరించి వచ్చే నెలతో ఏడాది పూర్తవుతుంది. ఇప్పటికి 11నెలలు కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2027లో అతి పెద్ద ఈవెంట్ రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలతో పాటు, ప్లానింగ్ కేతన్ గార్గ్ సిద్ధం చేసుకున్నారు. అయితే గత రెండు నెలలుగా కమిషనర్‌ను బదిలీ చేస్తారనే సమాచారం ఉంది. కాని పుష్కరాల ముందు కమిషనర్ బదిలీ ఉండకపోవచ్చని అందరు భావించారు. మరో పక్క కమిషనర్ కూడా తనదైన శైలిలో రాజమహేంద్రవరంలో పనులు చేపట్టారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆక్రమణల తొలగింపు వేగవంతం చేశారు.సరిగ్గా ఇదే విధానం గతంలో విజయరామరాజు చేపట్టిన నెలలోపు ఆయన కూడా బదిలీ అయ్యారు. ఇప్పుడు అదే తరహాలో కమిషనర్ కేతన్ గార్గ్ బదిలీ జరగడం వెనుక.. కమిషనర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కావొచ్చనే వాదన వినిపిస్తోంది. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తాగునీటి ఎద్దడిని అధిగమించే యాక్షన్ ప్లాన్ చేయడం, ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు కార్యరూపం దాల్చేలా చేయడం వేగంగానే చేశారు. నగర ప్రజలలో తనదైన ముద్రను వేసుకున్నారు. కేతన్ గార్గ్ బదిలీ కావడంతో ఆ స్థానంలో గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పని చేసిన రెండో ఉన్నతాధికారిని నియమించనున్నట్టు తెలిసింది. ఆయన పదోన్నతిపై ముఖ్యస్థానంలో ఉన్నప్పటికి రాజమహేంద్రవరానికి ప్రాధాన్యమిస్తున్నట్టు సమాచారం. అయితే గత ప్రభుత్వంలో చేసిన సదరు అధికారిని కూటమి ప్రభుత్వం అనుమతిస్తుందో లేదో వేచి చూడాలి. కేతన్ గార్గ్ మంగళవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

సోషల్ వెల్ఫేర్ అధికారులపై విచారణకు ఆదేశం

కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతంలో పనిచేసిన సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల వెరిఫికేషన్‌లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు విచారణకు విజిలెన్స్ సిఫారసు చేసింది. కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా గతంలో పని చేసిన డీవీ రమణమూర్తి, ప్రస్తుత డీడీ ఎం.శోభారాణి, జేడీ రంగలక్ష్మిలపై విచారణకు ఆదేశించింది. వీరు గతంలో పనిచేసిన సమయంలో పలు పీజీ కోర్సుల విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించి 50శాతం క్షేత్రస్థాయి వెరిఫికేషన్ చేయకుండా మంజూరు చేశారనే అభియోగంపై విచారణకు ఆదేశిస్తూ లిఖిత పూర్వక సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

అంతర్వేది, కేశవదాసుపాలెం ఏటిగట్లకు గండి.. కొబ్బరి, సరుగుడు తోటల్లోకి ఉప్పు నీరు

అంతర్వేది, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది, కేశవదాసుపాలెం గ్రామాల్లో సముద్ర తీర ప్రాంతాల వద్ద సోమవారం ఉదయం కెరటాల ఉధృతికి గట్లకు గండి పడింది. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న కెరటాలు అంతర్వేది సగర సంగమం నుంచి కేశదాసు పాలెం, కేశనపల్లి, కరవాక వరకు తీర ప్రాంత గ్రామాలు ఉప్పు నీటిమయ్యాయి. వాతావర ణంలో మార్పులు, అక్కడక్కడ కొద్ది పాటి వర్షాలు కురవడంతో సముద్రం వెంబడి ఉన్న తాత్కాలిక గట్లకు గడ్డు పడ్డాయి. సముద్రపు ఉప్పు నీరు అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం గ్రామాల్లో కొబ్బరి, సరుగుడు తోటల్లోకి తొచ్చుకుని వచ్చింది. 300 మీటర్ల ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాల తాకిడికి తీర ప్రాంతం కోతకు గురవుతోంది.



కొబ్బరి, సరుగుడు తోటలను ముంచుతున్న సముద్రనీరు

ఎస్ఐఎఫ్టీ ప్రిన్సిపాల్‌గా అంజలి



కాకినాడ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ (ఎస్ఐఎఫ్టీ) ప్రిన్సిపాల్‌గా ఎస్.అంజలి (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ కేడర్) సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా రైతులకు మేలు జరిగే విధంగా ల్యాబ్‌ల ద్వారా పీసీఆర్, మేత నాణ్యత, నీటి నాణ్యత, మైక్రో బయాలజీ పరీక్షల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల చెరువుల వద్దకు వెళ్లి మొబైల్ ల్యాబ్ సేవలందిస్తామన్నారు. రైతులు సాగు చేసిన రొయ్యలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ఎస్‌సీఎంఎస్, జీసీఎంఎస్ ల్యాబ్‌ల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధించిన యాంటీ బయాటిక్స్ లేని రొయ్యల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఆక్వా రైతులంతా ప్రభుత్వ ల్యాబ్ సర్వీసులను పూర్తిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిషింగ్ బోటు డ్రైవర్లకు శిక్షణలో భాగంగా ఇంజన్ రిపేరు నిర్వహణ, బోటు నడపడం, నావిగేషన్ సీమన్‌షిప్, వలల తయారీ రిపేరు, సముద్రంలో చేపల వేట అంశాలపై ఏడాది పాటు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 30శాతం జీవీఏ లక్ష్యాలు సాధించడంలో క్షేత్రస్థాయి సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ చేయడంలో తమ ఇనిస్టిట్యూట్ పాత్ర ఉంటుందని అంజలీదేవి వివరించారు.

ఆన్‌లైన్‌లో ఫైనల్ మెరిట్ లిస్ట్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది జనవరి 21న కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ) విడుదల చేసిన ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించి యాజమాన్యం ముఖ్యమైన సమాచారాన్ని విడుదల చేసింది. నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల తుది ఎంపిక పూర్తయ్యిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ పేర్లను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు తమకు కేటాయించిన ఉద్యోగ కేంద్రాలకు అనుగుణంగా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, ఆర్ఎంసీ నర్సింగ్ కాలేజ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో తమ విద్యార్హతల సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. పరిశీలన అనంతరం నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు.

24 నుంచి మరిడమ్మ జాతర ఉత్సవాలు

విజయవంతం చేయండి: ఆర్డీవో

పెద్దాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 24 నుంచి వచ్చే నెల 31వ తేదీ వరకు జరిగే మరిడమ్మ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో కర్రెడ్డి శ్రీరమణి కోరారు. మరిడమ్మ దేవస్థానంలో సహాయ కమిషనర్ కురం విజయలక్ష్మి ఆధ్వర్యంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సుమారు 37 రోజులపాటు జరిగే జాతర మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ రాజేష్, ఎలక్ట్రికల్ ఏఈ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఎస్ఐ మౌనిక, దేవస్థానం సిబ్బంది రమణ, జనసేన పట్టణాధ్యక్షుడు పోల మరశెట్టి సత్తిబాబు, కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, ఆసాదిరాయి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెండ్యాల నుంచి నీరు విడుదల

నిడదవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉన్న పెండ్యాల పంపింగ్ స్కీమ్ ద్వారా కానూరు ఆయకట్టుకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి సాగు నీటిని విడుదల చేసారు. డిస్ట్రిబ్యూటరీ కమిటి మాజీ అధ్యక్షుడు జుజ్జవరపు సూర్యభాస్కరరావు నీటిని విడుదల చేశారు. పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఆయకట్టు ద్వారా మండలంలోని గోపవరం, పురుషోత్తపల్లి, కానూరు మీదుగా సుమారు ఏడు వేల ఎకరాలకు నీరు అందనుంది.

ఎ.అన్నవరంలో కొత్త జూనియర్ కళాశాల మంజూరు

కాకినాడ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం ఎ.అన్నవరంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కొనసాగుతోంది. ఈ సంస్థకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేస్తూ 2025-26 విద్యా సంవత్సరంలో శారద జూనియర్ కళాశాలగా కొనసాగేందుకు పాఠశాల విద్యా శాఖ జీవో నెం.239 జారీ చేసింది.

అంతర్జాతీయ సెమినార్‌లో రమ్యసుధ ప్రతిభ

ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు పొందిన రంగంపేట ఉపాధ్యాయిని



రమ్యసుధను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12, 13 తేదీల్లో నేపాల్ దేశంలోని ఖాట్మాండులో ఎంఐటీ వారు ఏర్పాటు చేసిన 'ఇన్నోవేటివ్ ప్రాక్టీసస్ ఫర్ అక్సిలరేటెడ్ గ్రోత్ ఇన్ కామర్స్ హ్యూమానిటీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో రంగంపేట ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయిని రమ్యసుధ పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి తెలిపారు. ఈ సెమినార్‌లో రమ్యసుధ సమర్పించిన 'రీ ఇన్‌వెంటింగ్ టుమార్ డ్రైవింగ్ గ్రోత్ త్రూ సెంటిఫిక్ ఇన్నోవేషన్' అనే పరిశోధన పత్రానికి ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు లభించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన రమ్యసుధను హెచ్ఎం పార్థసారధి, ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూధనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

6,527 మంది ఉపాధ్యాయులు బదిలీ

కాకినాడ రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, ఎస్జీటీలకు సంబంధించి 6,527 మంది బదిలీ అయినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. జడ్పీ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లు నుంచి ప్రధానోపాధ్యాయులుగా 96 మంది, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం నుంచి 10 మంది, స్కూల్ అసిస్టెంట్లు నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారన్నారు. జడ్పీ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 28 మంది, ప్రభుత్వ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 19 మంది పదోన్నతి పొందినట్టు డీఈవో తెలిపారు. మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలోని ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా 204 మంది పదోన్నతి పొందారన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బదిలీలు,పదోన్నతుల ప్రక్రియ పూర్తయినట్టు డీఈవో తెలిపారు.

ఆరుద్ర కుమార్తెకు ఇంటి స్థలం

సీఎం చంద్రబాబు హామీ మేరకు పట్టా అందజేత



సాయిలక్ష్మికి పట్టాను అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం గొల్లగూడేనికి చెందిన రాజులపూడి ఆరుద్ర దివ్యాంగురాలైన తన కుమార్తె సాయి లక్ష్మీచంద్ర ఇటీవల జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబును కలిసి తమ గోడును వివరించారు. దీంతో స్పందించిన ఆయన ఆమెకు ఉద్యోగంతోపాటు ఇళ్ల మంజూరు చేయాలని సీఎం ఆదేశించారు. దీనిలోభాగంగా కామనగరువులో 72గజాల స్థలాన్ని సోమవారం కలెక్టరేట్‌లో సాయిలక్ష్మీచంద్రకు కలెక్టర్ మహేష్‌కుమార్ అందజేశారు. త్వరలో ఉద్యోగం కూడా ఇప్పిస్తామని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారిణి బీఎల్ఎన్ రాజకుమారి, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

27న షర్మిల రాక

కడియం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాజమహేంద్రవరం రానున్నట్టు జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో కడియంలో ప్రజాసామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీకే మాట్లాడుతూ ఏఐసీసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ 7 బుల్లెట్ పాయింట్లను తయారు చేసిందన్నారు. వీటిని కరపత్రాల ద్వారా ఇంటింటికి కాంగ్రెస్ అనే నినాదంతో ప్రజల్లోకి తీసుకెళతున్నామన్నారు. ప్రస్తుతం సామాజిక న్యాయం జరగడం లేదని, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్టిన్ లూదర్, అరిగెల అరుణకుమారి, వడయార్, కాకర్ల హరిబాబు, మోతా శారద, చిన్నం మురళి, భద్రం దొర, అబ్దుల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి క్షేత్రంలో యోగాంధ్ర

- పాల్గొన్న కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

ఆత్రేయపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలోని జిల్లా స్థాయి ఫ్యామిలీ యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించారు. యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం ప్రశాంత జీవనశైలిని పొందవచ్చని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. యోగా భారతదేశ వారసత్వ సంపదగా అభివర్ణించారు. ఆధునిక జీవనశైలిలో అనేక రుగ్మతలతో బాధపడుతున్న తరుణంలో యోగా ప్రాణాపాయ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మూడు తరాలకు చెందిన సంతతి ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వకారణమన్నారు. ఆహ్లాదకరమైన వాతవరణమైన వాడపల్లి పుణ్యక్షేత్రంలో యోగా సాధన చేయడం ఏర్పాట్లు తదితర అంశాలపై నిర్వహకులను అభినందించారు. సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ఆయుష్ వైద్యుల పర్యవేక్షణలో ఓం శాంతి యోగా గురువులు ప్రదర్శన చేయించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్.రాజకుమారి, ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రదరరావు, ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన

వాడపల్లిలో జరిగిన యోగాంధ్రలో సాంస్కృతిక ప్రదర్శన దృశ్యం


భారీగా హాజరైన ప్రజలు (డ్రోన్ ఫొటో)

దబ్బాదిలో ప్రబలిన డయేరియా

- వృద్ధురాలి మృతి
- రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 44 మంది గిరిజనులు
- వారిలో 12 మందికి పైగా పిల్లలు
- పులిహోర తిన్నామంటున్న గ్రామస్తులు




రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రౌతులపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సబ్‌ప్లాన్ ఏజెన్సీ రాఘవపట్నం గ్రామశివారు దబ్బాదిలో డయేరియా ప్రబలింది. గ్రామానికి చెందిన వంతల చెల్లయ్యమ్మ(65) మృతిచెందింది. వెలుగు లోవరాజు, వంతు నాగసీత, వంతు గంగాభవాని, రొబ్బా వీరబాబుతో సహా సూమారు 44 మంది రౌతులపూడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో 9 నుంచి 12 ఏళ్ల ఉన్న పిల్లలు 12 మందికి పైగా ఉన్నారు. మంచాలు సరిపోకపోవడంతో డీసీహెచ్‌ఎస్ స్వప్న ఆదేశాలు మేరకు తుని ఏరియా ఆసుపత్రి తరలించారు. పాడేరు ఆసుపత్రిలో లోవరాజు, రమణ వైద్యం పొందుతున్నారు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వంతు రామయ్యమ్మ, నాగమణి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు గ్రామంలో మోద కొండమ్మతల్లి ఆలయానికి మొక్కు తీర్చుకోవడానికి దబ్బాది, సుందరకోట, అనసగిరి గ్రామాలకు చెందినవారు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం మధ్యాహ్నం 12 గంటలకు వ్యాన్‌పై 60 మందితో బయలుదేరారు. మార్గమధ్యంలో నర్సీపట్నం దాటిన తరువాత రాత్రి 8 గంటల సమయంలో వారి వెంట పట్టుకుని వెళ్లిన పులిహోర తిన్నారు. ఆదివారం తెల్లవారు జామున 3 గంటలకు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. స్నానాలు చేసి రామయ్యమ్మ,నాగమణి మొక్కు తీర్చుకున్నారు. తర్వాత వంటలు చేసుకుని తినడానికి సిద్ధంగా ఉన్న సమయంలో కొందరికి కడుపు నొప్పితో విరోచనాలు పట్టుకున్నాయి. వారిని పాడేరు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారికి బాగా ఉండడంతో వారితో పాటు మిగిలిన వారు బస్సులో బయలు దేరి ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామం దబ్బాది చేరుకున్నారు. అనంతరం వారికి విరోచనాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వంతల చెల్లయ్యమ్మ మృతిచెందడంతో ఒక్కసారిగా గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వైద్యం సిబ్బందికి విషయం తెలియడంతో హుటాహుటిన రౌతులపూడి ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. గ్రామస్తులు తిన్న పులిహోరను వైద్య సిబ్బంది శాంపిల్ తీసి టెస్టులకు పంపించారు. దబ్బాది గ్రామస్తులంతా తమ వారి కోసం రౌతులపూడి ఆసుపత్రికి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. బాధితులకు టీడీపీ యువనేత సోమ రౌతు చంద్రమౌళి భోజనాలు అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని జిల్లా వైద్యాధికారి డా.నరసింహ నాయక్ పరామర్శించారు. ఆసుపత్రిలో పరిస్థితులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు.

శానిటేషన్ మెరుగుపడకపోతే చర్యలు

అన్నవరం దేవస్థానం ఈవో హెచ్చరిక

శానిటేషన్ సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్ష


శానిటరీ సూపర్‌వైజర్లతో సమావేశమైన ఈవో సుబ్బారావు

అన్నవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శానిటేషన్ నిర్వహణపై భక్తుల్లో 50శాతం మాత్రమే సంతృప్తి ఉందని, పరిస్థితి మెరుగుపడకపోతే చర్యలు తప్పవని ఈవో వీర్ల సుబ్బారావు హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో శానిటేషన్ సూపర్‌వైజర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సత్రం గదుల్లో నిర్వహణ సరిగా లేదని, భక్తులకు శానిటేషన్ సిబ్బంది వారు కోరిన సమాచారం అందించాలని, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలిగినా ఎవరో వస్తారని చూడకుండా తక్షణ సాయం అందించాలన్నారు. ప్రతిశానిటరీ సూపర్‌వైజర్ వద్ద దేవస్థానం వైద్యుని, అంబులెన్స్ ఫోన్ నెంబర్లు ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఇక్కడ జరిగే శానిటేషన్ నిర్వహణ దేవదాయశాఖ ప్రధాన కార్యలయం, సీఎంవోలో నివేదిక రూపంలో ఉంటుందని జాగ్రత్తగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, సూపరెంటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

దినుసులు పరిశీలన

అన్నవరం దేవస్థానానికి అవసరమయ్యే దినుసులును సోమవారం ఆహార నియంత్రణ అధికారి సుబ్బారావు సోమవారం పరిశీలించారు. ఇప్పటివరకు టెండర్ దాఖలు సమయంలో వీటిని పరిశీలించి హడావిడిగా ముగించేవారు. ఈనెల 20న టెండర్లు తెరవనున్న సమయంలో ముందస్తుగా టెండర్‌దారులు సరఫరా చేయనున్న దినుసుల శాంపిల్స్ తీసుకురావాలని ఈవో సుబ్బారావు గుత్తేదారులను ఆదేశించి నాణ్యత ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం తీసుకొచ్చిన శాంపిల్స్ ఏ విధంగా ఉన్నాయో టెండర్ ఖరారయ్యాక ఇదే నాణ్యతతో కూడిన దినుసులు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్‌స్టోర్స్ అధికారులు భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

గోదావరిలో మునిగి కరప యువకుడి మృతి


సాయికృష్ణ (ఫైల్‌ఫొటో)

కరప, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యానాం-ఎదుర్లంక బ్రిడ్జి కింద గోదావరిలో స్నానానికి దిగి గల్లంతైన కరప యువకుడి మృతదేహం సోమవారం సాయంత్రం లభ్యమయ్యింది. కాకినాడ జిల్లా కరప గ్రామానికి చెందిన నరాల సాయికృష్ణ(17) ఆదివారం మిత్రులతో కలిసి యానాం వెళ్లాడు. యానాం-ఎదుర్లంక బ్రిడ్జి దాటిన తరువాత గోదావరిలో స్నానానికి దిగాడు. అయితే లోతు ఎక్కువగా ఉండడంతో సాయికృష్ణ గల్లంతయ్యాడు. స్నానానికి దిగిన మిగిలిన మిత్రులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బోట్ల ద్వారా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆదివారం సాయంత్రం సాయికృష్ణ స్నానానికి దిగిన చోటనే శవమై తేలడంతో పోలీసులు ఒడ్డుకు తీసుకువచ్చారు. విగతజీవిగా పడిఉన్న సాయికృష్ణను చూసి కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. సాయికృష్ణ తండ్రి బుజ్జి, తాత రామకృష్ణ కరపలో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు బంధువులు తెలిపారు. కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

పెద్దాపురంలో వ్యక్తి దారుణ హత్య

కేసు నమోదు చేసిన పోలీసులు

పలు కోణాల్లో దర్యాప్తు


శ్రీనివాస్ ఫైల్‌ఫొటో


హత్యకు గురైన శ్రీనివాస్

పెద్దాపురం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం శివారు కట్టమూరు పుంత ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కిర్లంపూడి మండలం గోనెడ గ్రామానికి చెందిన జానకి సత్య శ్రీనివాస్ అలియాస్ వెంకన్నబాబు (32) స్థానికంగా ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మృతుడు శ్రీనివాస్ హత్యకు గురి కావడానికి సంబంధించి పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తును ప్రారంభించారు. పదునైన ఆయుధంతో మెడ భాగంలో బలంగా కొట్టి చంపినట్లు తెలుస్తోంది. మృతదేహం వద్ద బీరు బాటిల్‌కు సంబంధించిన గాజు ముక్కలు ఉండటం కూడా పలు అనుమానాలు కలిగిస్తోంది. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. వివాహేతర సంబంధమా లేక మద్యం మత్తులో ఎవరైనా హత్య చేశారా మరే ఇతర కారణమేదైనా ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తును చేస్తున్నారు. పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక సంఘటనా స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. దీనిపై కేసును నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

సంద్రంలో వేటకు వెళ్లి మృతదేహాలుగా తేలి..

- ఇద్దరు మత్స్యకారులు మృతి
- మరో నలుగురు సురక్షితం
- కోనసీమ జిల్లా అంతర్వేదిలో ప్రమాదం


అంతర్వేదిలో లభ్యమైన నాగిడి రాము, తమ్ము పోతురాజు మృతదేహాలు

అంతర్వేది, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం వేటకు బయలుదేరి అంతర్వేది సముద్ర తీరంలో ఇద్దరు మత్స్యకారులు గల్లంతై మృతదేహాలుగా తేలారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది సాగర సంగమం సముద్ర తీరంలో సోమవారం ఉదయం బోటు ప్రమాదం జరిగి ఇద్దరు మృతిచెందగా మరో నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణాజిల్లాలోని నాగలలంక గొల్లలమూత గ్రామానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు ఆదివారం వేటకు బయలుదేరారు. ఐఎడీఏపీకే3 ఎం089 శ్రీకనకదుర్గ బోటు యజమాని నాగిడి వెంకటేశ్వరరావు బోటులో కృష్ణా జిల్లా నుంచి వేటకు బయలుదేరి బందరు మీదుగా అంతర్వేది చేరుకునేసరికి సోమవారం ఉదయం వాతావరణంలో వచ్చిన మార్పులకు సాగర సంగమం వద్ద అలల ఉధృతికి కెరటాలు ఒక్కసారిగా బోటుపై పడడంతో బోటుపైన ఉన్న నాగిడి రాము (20), తమ్ము పోతురాజు(50) జారి సముద్రంలో పడిపోయారు. సాటి మత్స్యకారులు వారిని కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ఉవ్వెత్తున ఎగసిపడుతూ కెరటాల రావడంతో సాగర సంగమం మొగ వద్ద గల్లంతయ్యారు. వారి ఆచూకీ కోసం మిగిలిన నలుగురు మత్స్యకారులు వెతకసాగారు. కెరటాలు అధికంగా రావడంతో అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు చేరుకుని స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. విశ్వనాథపల్లి సత్యనారాయణ, విశ్వనాథపల్లి నాగరాజు, విశ్వనాథపల్లి సామోరు, నాగిడి వెంకటేశ్వరరావు సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన ఇద్దరి మృతదేహాలు గంటల వ్యవధిలోనే లభ్యం కావడంతో సఖినేటిపల్లి ఎస్‌ఐ దుర్గాశ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు


ఆసుపత్రిలో క్షతగాత్రులు

వై.రామవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పనసలపాలెం ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పి.ఎర్రగొండకు చెందిన కోండ్ల బాబిరెడ్డి చవిటిదిబ్బలు నుంచి బైక్‌పై పి.ఎర్రగొండ వస్తున్నాడు. ఎదురుగా వై.రామవరం నుంచి అడ్డతీగల వెళ్తున్న మిరియాల సాయి, భూముల కొండబాబుల బైక్ ఢీకొని ముగ్గురూ గాయపడ్డారు. వై.రామవరం ఆసుపత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యానికి ఇద్దరిని కాకినాడ, ఒకరిని రంపచోడవరం ప్రభుత్వాసుపత్రులకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. బాబి రెడ్డి ఫిర్యాతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు దాడి

14 మందిపై హత్యాయత్నం కేసులు

ఆలమూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడి చేసిన సంఘటనలో ఇరు వర్గాలను అదుపు చేసి 14మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినట్టు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ తెలిపారు. ఈనెల 15న రాత్రి కోనసీమ జిల్లా ఆలమూరు ఎర్రకాలనీ సమీపంలో పలివెల తేజ, కొమ్ము రోహిత్‌కి చెందిన వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడానికి కొట్లాటకు దిగారు. ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని ఆలమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వారు అందించిన సమాచారం మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఒక వర్గానికి చెందిన పలివెల తేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గునుపల్లి నాగసాయికృష్ణప్రసాద్, కొమ్ము రోహిత్, గౌరి శంకరర్, కొమ్ము నారాయుడు, ఆదినారాయణ, చల్లా సందీప్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌తోపాటు పలువురిపై కేసు నమోదు చేశారు. అలాగే మరోవర్గానికి చెందిన కొమ్ము రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలివెల తేజ, దొనకొండ మోషే, దొనకొం విజయ్, పొలమూరు ప్రసన్న, తోరాటి ఏసు, వేమగిరి అనిల్, మరికొందరిపై కేసులు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్ట్

గండేపల్లిలో రూ.5.53 లక్షల విలువైన 50 గంజాయి ప్యాకెట్ల స్వాధీనం


గంజాయితో నిందితులను అదుపులోకి తీసుకున్న గండేపల్లి, జగ్గంపేట పోలీసులు

జగ్గంపేట/ గండేపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను కాకినాడ జిల్లా జగ్గంపేట సీఐ కార్యాలయంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సోమవారం వెల్లడించారు. కాకినాడ జిల్లా గండేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేస్తుండగా షిఫ్ట్ డిజైర్ కారును పోలీసులు ఆపారు. నెలూరు జిల్లాకు చెందిన కల్లపల్లి నాగేంద్ర, కడప జిల్లాకు చెందిన షేక్ సుధార్‌వల్లి, పందిళ్లపల్లి శివకుమార్, ఓ మైనర్ ఉన్నారు. కారులో 110.640 కిలోల గంజాయి ఉంది. వారిని అదుపులోకి తీసుకుని 50 గంజాయి ప్యాకెట్లు, 4 ఫోన్లు, రూ.3500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురు సీలేరు నుంచి తిరుపతి మీదుగా తమిళనాడుకు చెందిన వ్యక్తికి గంజాయి రవాణా చేస్తున్నారని డీఎస్పీ వివరించారు. గంజాయి విలువ రూ.5,53,200 ఉంటుందన్నారు. దీనిపై గండేపల్లి పోలీస్‌స్టేషన్లో కేసు చేశామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన జగ్గంపేట సీఐ వైఆర్‌కె.శ్రీనివాస్, దర్యాప్తులో పాల్గొన్న గండేపల్లి ఎస్‌ఐ యువి.శివ నాగబాబు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. సమావేశంలో సీఐ వైఆర్‌కె శ్రీనివాసరావు, ఎస్‌ఐలు శివనాగబాబు, రఘునందనరావు ఉన్నారు.

పోలిపాకలో ఇద్దరి అరెస్ట్

కూనవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఇద్దరిని కూనవరం పోలీసులు పట్టుకున్నారు. కూనవరం ఎస్‌ఐ లతాశ్రీ కథనం ప్రకారం.. అల్లూరి జిల్లా కూనవరం మండలం పోలిపాక శివారు వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా నెల్లపాక నుంచి కూనవరం వైపుగా ద్విచక్రవాహనం (ఏపీ40ఏఎఫ్ 4943)పై వస్తున్న ఇద్దరు పోలీసులను చూసి ద్విచక్రవాహనాన్ని వెనక్కి తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో వారిని ఎస్‌ఐ లతాశ్రీ, సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. వారి బ్యాగులను పరిశీలించగా 21 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో వారిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, ఫోన్‌ను సీజ్ చేశారు. వారికి గంజాయి అమ్మిన ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.1,05,000 ఉంటుందని ఆమె చెప్పారు.


గంజాయితో ఇద్దరిని పట్టుకున్న కూనవరం పోలీసులు

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

బిక్కవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి శెట్టిబలిజపేటకు చెందిన మేడిశెట్టి వెంకటరమణ (45) మద్యానికి డబ్బులివ్వలేదని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పందలపాక గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ వి.రవిచంద్ర కుమార్ వివరాల ప్రకారం.. వెంకటరమణ జట్టు కూలీగా పందలపాకలోని ఒక రైసుమిల్లులో పనిచేస్తున్నాడు. ఆదివారం వర్షం కారణంగా పని లేకపోవడంతో మద్యం కోసం ఇంట్లో తల్లి, కుమారుడిని రూ.100 అడిగాడు. వారు లేదనడంతో మిల్లు వద్ద మరో కూలీని డబ్బులు అడిగాడు. అతడు కూడా లేవనడంతో మిల్లు ముందు ఉన్న రేకుల షెడ్డుతో టవల్‌తో ఉరి వేసుకుని మృతిచెందాడు. మిల్లు వాచ్‌మెన్ ఆదివారం రాత్రి పది గంటలకు ఉరి వేసుకున్న వెంకటరమణను చూసి సమాచారం ఇవ్వడంతో తాము కేసు నమోదు చేసి మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ వివరించారు.


వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రవిచంద్రకుమార్

తరలిన తల్లిలోకం!



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. దీంతో వాటిని తీసుకోవడానికి కాకినాడ మెయిన్‌రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద లబ్ధిదారులు ఇలా కిక్కిరిసేలా క్యూ కట్టారు.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

నిద్ర గమ్మత్తు!



పూట గడవడానికి కష్టపడి అలసిపోయిన ఓ రిక్షా కార్మికుడు రోడ్డు పక్కన ఓ ఇంటి ఆవరణలో ఆదమరిచి నిద్రపోతుంటే పక్కనే రెండు శునకాలు కూడా కునుకువేశాయి. కాకినాడలో గమ్మత్తుగా కనిపించిన ఈ చిత్రాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.

\- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పనులు వేగంగా పూర్తవ్వాలి : ఎమ్మెల్యే వాసు



డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 13వ డివిజన్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక తాడితోట ఎంజీ కాంప్లెక్స్ నిత్యం రద్దీగా ఉంటోందని, సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేస్తామన్నారు. గోదావరి పుష్కరాలు 2027లో జరుగబోతున్నందున నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు వేంగంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

'రిమ్మలపూడి'కి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం



ఎంపీ నుంచి పురస్కారం అందుకుంటున్న రిమ్మలపూడి

రంగంపేట, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపూడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత రిమ్మలపూడి సత్యనారాయణమూర్తి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్నారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవంలో భాగంగా పాన్ ఇండియా, ఫిలాంత్రోఫిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సేవా కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా రాజమండ్రిలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణమూర్తికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరీ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాన్ ఇండియా వ్యవస్థాపకుడు అద్దంకి రాజా పాల్గొన్నారు. సత్యనారాయణను పలువురు అభినందించారు.



వృద్ధుడిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

వృద్ధుడికి వైద్యసేవలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కడియం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): 'ఈ వయస్సులో.. అనాథలా అంటూ' ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రాజస్థాన్‌కు చెందిన ఓ వృద్ధుడు మూడు నెలలుగా వేమగిరి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో అనాథలా ఉంటున్నాడు. అతడి దీనగాథ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. దానిని జతచేసి పారాలీగల్ వలంటీరు యనమదల వెంకటేశ్వరరావు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. దాంతో అతడికి వైద్య సేవలందించాలని జిల్లా అధికారులు ఆదేశాలిచ్చారు. వైద్యఆరోగ్య శాఖ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచనలతో కడియం వైద్యాధికారిణి డాక్టర్ మణిజ్యోత్స్నకు వేమగిరి వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశారు. వైద్యసిబ్బంది పి.మురళికృష్ణ, వి.ఉమామహేశ్వరి, ఆశాకార్యకర్తలు ఆ వృద్ధుడిని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య సేవల తరువాత ఆశ్రమంలో చేర్పనున్నట్టు చెప్పారు.

మెరిట్ విద్యార్థులకు ఇంటర్ ప్రవేశానికి కౌన్సెలింగ్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి పదో తరగతి ఫలితాల్లో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు వారికి నచ్చిన ప్రైవేట్ కళాశాలలో అతి తక్కువ ఫీజుతో ప్రవేశానికి కౌన్సిలింగ్‌లో భాగంగా విద్యోన్నతి కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకు అహర్నిశలు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. పదో తరగతి పరీక్షల్లో నగర పాలక సంస్థ 13 పాఠశాలలు నుంచి 176 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు సాధించారని వీరంతా తమకు నచ్చిన ప్రైవేట్ కళాశాలలో అతితక్కువ ఫీజులతో ఇంటర్మీడియేట్ ప్రవేశానికి నగరపాలక సంస్థ విద్యోన్నతి ద్వారా అవకాశం కల్పిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో అర్బన్ డీఐ దిలీప్‌కుమార్, ఆర్ఐవో నరసింహరావు, కార్పొరేషన్ మేనేజరు ఎండీ అబ్దుల్‌మాలిక్, ఆర్‌వో సీహెచ్ శ్రీనివాసరావు, హెచ్ఎంలు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలి



కళాజాతతో అవగాహన అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సీతానగరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి ఆరోగ్యాలు మెరుగుపర్చుకోవాలని ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమ కారిణి, స్వచ్ఛాంధ్ర అవార్డు గ్రహీత గారపాటి వనజ అన్నారు. సోమవారం ఆమె ఆధ్వర్యంలో కాటవరం ఎంపీయూపీ పాఠశాలలో ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా విజయవాడకు చెందిన శాంతి కల్చరల్ సొసైటీ వారితో ప్లాస్టిక్‌తో నష్టాలు, కష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వనజ మాట్లాడుతూ కాటవరంలో జాతర సందర్భంగా ప్లాస్టిక్ వాడకం, దాని వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాలను నివారించాలని, వాటి స్థానంలో కాగితం ప్లేట్లు, విస్తర్లు, స్టీలు సామాన్లు వినియోగించాలన్నారు. అనంతరం గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టూరి రమేష్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, ఎం.సంగీత, ఎ.సత్యశ్రీనివాస్, కె.సత్తిబాబు, జి.శ్రీదేవి, జి.హిమజ విద్యార్థులు పాల్గొన్నారు.

'తల్లికి వందనాన్ని జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు'

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే వైసీపీ శ్రేణులు జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఈ మేరకు తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 67లక్షల మంది తల్లులకు తల్లికి వందన పథకం ద్వారా 8,745 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమచేశారన్నారు. జగన్ ఎన్నో వాగ్దానాలు చేసి వాటిని మాటలకే పరిమితం చేశారని ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు చదువుకునే పిల్లలందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయడంతో తట్టుకోలేక తప్పుడు ప్రచారాలకు తెరలేపారని దీనిని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయనుందని గన్ని కృష్ణ పేర్కొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు బాగున్నాయని, సీఎం చంద్రబాబు నేతృత్వంలో విద్యా శాఖ మంత్రి లోకేశ్ మరింత ఉన్నత ప్రమాణాల కోసం కృషి చేస్తున్నారని, ప్రభుత్వ ప్రయోజనాలు పొందుతున్న వారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని నాలుగో వార్డు ఇన్‌చార్జి నక్కా చిట్టిబాబు కోరారు. సోమవారం స్థానిక రాజేంద్రనగర్ మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బాలసదనం బాలికల వసతి గృహానికి చెందిన సుమారు ఇరవై మంది విద్యార్థినులను ఈ పాఠశాలలో చేర్పించారు. అనంతరం నక్కా చిట్టిబాబు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో బళ్లా శ్రీనివాసరావు, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, బాలసదనం ఇన్‌చార్జి జి.రోజారాణి, ప్రధానోపాధ్యాయులు జీడీఐజే డేనియల్, సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం విజయవంతం

టీడీపీ నాయకుడు యిన్నమూరి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని చాంబర్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం విజయ వంతంగా జరిగిందని టీడీపీ నాయకుడు యిన్నమూరి ప్రదీప్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన, తెలుగు మహిళా రాజమండ్రి పార్లమెంట్ కమిటీ అధ్యక్షురాలు, మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండిప్రియలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీప్ మాట్లాడుతూ అఖిల పక్ష సమావేశానికి అన్ని పార్టీల నాయకులు వచ్చారని నిర్మాణాత్మక సలహాలు, సూచనలు చేశారని గుర్తుచేసారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అఖిల పక్ష సమావేశం నిర్వహించి మళ్లీ మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టారన్నారు. సుబ్రహ్మణ్యం మైదానం విషయంలో అఖిల పక్షం ఎందుకు దండగా అన్న మాజీ ఎంపీ భరత్‌రామ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఇక ఎమ్మెల్యే వ్యక్తిగత పీఏ విషయంలో భరత్‌రామ్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. తనపై ఉన్న రౌడీ షీట్ ఎత్తివేయాలని 2019 నుంచి అతను అర్జీలు పెట్టుకుంటూ వచ్చాడని, అధికారులు విచారణ జరిపి అతనిపై నిఘా పెట్టి ఎలాంటి కేసులు లేవని రౌడీషీట్‌ను తీసివేశారని పేర్కొన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు మీసాల నాగమణి, గొర్రెల రమణి, బోను ఈశ్వరి, తుల్లి పద్మ, లీలావతి, నాయకులు వెంకన్న, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జనవాణి

కోరుకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనవాణి కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం కోరుకొండ మండలం గాడరాడ గ్రామంలో మధ్యాహ్నం 3గంటల నుంచి జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నామని చెప్పారు.

హామీలన్నీ అమలు చేస్తాం

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి



వేమగిరి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కూటమి ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. సోమవారం వేమగిరిలోని ఉన్నత పాఠశాల ఆవరణలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఒక బిడ్డకు మాత్రమే 'అమ్మఒడి' వేసిందని, మూడేళ్లు వేసి రెండేళ్లు పంగనామం పెట్టిందని ఆరోపించారు.తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంతమంది చదుకునే పిల్లలు ఉన్నా సరే ప్రతి ఒక్కరికీ రూ.13 వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాకు కూటమి జమ చేసిందన్నారు. మిగిలిన రూ.2 వేలు పాఠశాల అభివృద్ధికి ఉపయోగిస్తుందన్నారు. మండలంలో ఒకరు-3199, ఇద్దరు-2843, ముగ్గురు-228, నలుగురు-13 వెరసి 9,621 మంది విద్యార్థుల సొమ్మును తల్లుల ఖాతాకు జమ చేసినట్టు వివరించారు. సన్నబియ్యం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. తల్లికి వందనం పథకం అమలుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, డా. వెలుగుబంటి వెంకటాచలం, చెల్లుబోయిన శ్రీను, మార్ని వాసుదేవరావు, బోడపాటి గోపి, వాసిరెడ్డి రాంబాబు, పంతం గణపతి, గట్టి సుబ్బారావు, దంగేటి సత్తిబాబు,సూరపురెడ్డి జానకీరామ్ పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌లో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో అందిన ప్రతీ అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని మునిసిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆయన 16 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర పరిధిలో వచ్చిన అర్జీలలో రెవెన్యూ విభాగానికి 3, టౌన్ ప్లానింగ్‌కు 3, మెప్మాకి 3, వార్డు సచివాయాలకు సంబంధించి 3 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ అర్జీలు పరిష్కారం కాలేదనే ఫిర్యాదు రాకూడదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజావల్లి, ఎస్ఈ ఎం సీహెచ్ కోటేశ్వరరావు, మేనేజరు ఎం డీ అబ్దుల్‌మాలిక్, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న పాల్గొన్నారు.

ఆర్టీసీ బోర్డులపై పేరు మార్చండి...

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల నేమ్‌బోర్డులపై ఉన్న రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మార్చాలని జిల్లా తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో డీఆర్వో టి.సీతారామమూర్తికి వినతిపత్రం సమర్పించారు.2015 ఆగస్టు 26న అప్పటి సీఎం చంద్రబాబు రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మారుస్తూ ప్రకటించారని, తద్వారా ప్రభుత్వ, వివిధ కార్యాలయాలు, విద్యా సంస్థల్లోను రాజమహేంద్రవరంగా మార్చారని, అలాగే రాజమహేంద్రవరం కేంద్రం నుంచి తిరిగే అన్ని బస్సులపై కూడా రాజమహేంద్రవరంగా మార్చాలని ధర్మరాజు విజ్ఞప్తి చేశారు.



అర్జీ అందజేస్తున్న ధర్మరాజు

తల్లికి వందనం అమలు భేష్

- పుష్కరాల నిర్వహణకు స్థానిక ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా కల్పించాలి
- రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశం దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం కింద నగదు బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం భేష్ అని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంక్షేమ సంఘం అభిప్రాయపడింది. సోమవారం రాజమహేంద్రవరంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో తల్లికి వందనం పథకం అమలు తీరును అభినందిస్తూ తీర్మానం చేశారు. ఎన్నికల ముందుకు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించేందుకు మంత్రి లోకేశ్ చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను ఘనంగా జరగాలని 2015లో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదా కల్పించి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు చేశారు. సంఘం వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తమకు రాజకీయాలతో సంబంధంలేదని ఏ ప్రభుత్వం మంచిచేసినా అభినందిస్తామని చెప్పారు. కేరళ మాదిరిగా బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను ఏపీలో కూడా పాఠ్యాంశంగా చేర్చాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి జార్జి ఆంటోని మాట్లాడుతూ వార్డులలో సచివాయాలుగా మార్చిన కమ్యూనిటీ హాళ్లను తిరిగి స్థానిక ప్రజలకు అప్పగించాలని కోరారు. సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ, పోలవరపు రాము, బీఎస్‌వీ ప్రతాప్, పలివెల సత్యనారాయణ, రవీంద్ర తదితరులు మాట్లాడారు.

యోగాను జీవనశైలిలో భాగం చేసుకోవాలి

రాజమహేంద్రవరం మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భారతీయ సనాతన సంపదైన యోగాను తమ జీవన శైలిలో భాగంగా చేసుకోవాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద సోమవారం ఉదయం 6 గంటలకు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయనతోపాటు నగర పాలక సంస్థ ఉద్యోగులు పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్ర-2025ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. నేటి యువత యోగ సాధన పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ శైలజా వల్లి, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరావు, మేనేజరు అబ్దుల్ మాలిక్, సీఎంఎం రామలక్ష్మి, అకౌంటెంట్ రమణరావు, ఆర్‌వో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పీహెచ్‌సీలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి మాట్లాడారు. యోగాను అల వాటు చేసుకొని ఆరోగ్యవంతమైన జీవితం గడపాలన్నారు. వైద్యులు, పీహెచ్‌సీ సిబ్బంది యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.చిన్నారావు, ఎం.ఇందిరా, పీహెచ్‌సీ సిబ్బంది ప్రసాద్, మేరీ హెలినా, నాగలక్ష్మీ, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు మహిళలు, యువత పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కార్పొరేషన్ ఉద్యోగులు

బొమ్మలు, పేర్లు మారాయి!

కోరుకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంగా గాఢ నిద్రలో ఉన్నవ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదివారం ఇచ్చిన వార్నింగ్‌తో మేల్కొన్నారు. ఆదివారం పశ్చిమగోన గూడెం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బత్తుల స్థానిక రైతు భరోసా కేంద్రంపై ఉన్న మాజీ సీఎం బొమ్మను, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంపై ఉన్న వైఎస్సార్ పేరును చూసి 48 గంటల్లో మార్చాలని వ్యవసాయ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫోన్ ద్వారా హెచ్చరించారు. చేశారు. దీంతో ఆర్‌బీకేపై ముద్రించి ఉన్న మాజీ సీఎం జగన్ బొమ్మపైన, విలేజ్ హెల్త్ క్లినిక్‌పై ఉన్న వైఎస్సార్ పేరుపైన రంగువేశారు. ఈ పనేదో ఏడాది కాలంలోనే చేసి ఉంటే ఎమ్మెల్యే వెళ్లి చూసి హెచ్చరికలు చేసి ఉండకపోదురని స్థానికులు అంటున్నారు.





బీజేపీలో చేరికలు

గోకవరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెలపాలెం గ్రామానికి చెందిన పలువురు సోమవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ నాయకుడు, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 110 మంది బీజేపీలో చేరారు. రానున్న రోజుల్లో రంపచోడవరం, రాజానగరం, జగ్గంపేట నియోజకవర్గాల నుంచి అనేక మంది తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై బీజేపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు, వరసాల ప్రసాద్, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, దేశాల నరేష్, ఆదం మణికంఠ, ఐబీ దొర తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారితో కంబాల శ్రీనివాసు

సనాతన ధర్మ పరిరక్షణకే

పాదయాత్ర

నల్లజర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పరిరక్షిం చేందుకు కాశీ నుంచి కన్యాకుమారి వరకు 7వ పర్యాయంగా సాగుతున్న మహాపాదయాత్ర తెలికిచర్ల మీదుగా సోమవారం చీపురుగూడెం చేరుకుంది. పాదయాత్ర నిర్వాహకుడు బద్రీ బలరామ్‌దాస్ మాట్లాడుతూ భారతదేశంలో అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ 1984లో ప్రారంభమైన మహాపాద యాత్ర 6 పర్యాయాలు పూర్తి చేసుకుని 7వ పర్యాయం ప్రారంభించినట్టు చెప్పారు. భారతదేశంలో భక్తులకు కృష్ణుడి విశిష్టత తెలుపుతూ నగర సంకీర్తనలుచేస్తూ పాదయాత్ర సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో పాదయాత్రగా వస్తున్న మమ్మలను ఎంతో ప్రేమగా స్వాగతం పలుకుతూ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం కంపన దుర్గారావు ఇంటివద్ద పాదయాత్ర చేస్తున్న సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదం అందించారు. కూనంపూడి వెంకటేశ్వరరావు గుళ్లపూడి వెంకటరత్నం, తలంశెట్టి మురళీ, వరలక్ష్మి, కొత్తపల్లి హరిబాబు, గుళ్లపూడి గణేశ్ పాల్గొన్నారు.

అమ్మా.. ఎలాగున్నారు?

రాజమహేంద్రవరం జూన్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ జీవకారుణ్య సంఘ ఆవరణలోని వృద్ధాశ్రమాన్ని సోమవారం సందర్శించారు. వృద్ధులతో మాట్లాడి బాగోగులపై ఆరా తీశారు. వసతులు, సదుపాయాలు, ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం సన్‌షైన్ బాయ్స్ హోమ్, ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాలను సందర్శించి వసతులను గమనించారు. క్రమశిక్షణ, సహనంతో ఉండాలని చెడు స్నేహాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలని పిల్లలకు చెప్పారు.



'అర్హులందరికీ తల్లికి వందనం'

దివాన్‌చెరువు, జూన్16 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తల్లికి వందనం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కందుల బాబూరాయుడు అన్నారు. దివాన్‌చెరువులో సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ పథకం పక్కాగా అమలయ్యే విధంగా రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు. తల్లుల ఖాతాల్లో సొమ్ము జమయ్యే విషయంలో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులకు ఆదేశాలిచ్చారన్నారు. అలాగే ఒక కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలు ఎంతమంది ఉన్న వారంతా ఈ పథకానికి అర్హులైతే వెంటనే సొమ్ము సంబంధిత తల్లుల ఖాతాల్లో జమ చేస్తుండడంతో తల్లులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతమయ్యేందుకు వీలవుతుందని బాబూరాయుడు తెలిపారు.

యువకుడి అదృశ్యం



రాజానగరం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వచ్చిన ఓ యువకుడు తిరిగి ఇంటికి చేరకపోవడంపై భార్య రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన 28 ఏళ్ల సలాది రాంబాబు ఈ నెల 14న రాజానగరంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఆ రోజు రాత్రి భోజనం అనంతరం బంధువులతో కలిసి ఇంట్లో నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం చూసే సరికి ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెళ్లిన సమయంలో లైట్ గ్రీన్ కలర్ టీషర్ట్, ట్రాక్ ధరించి ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు రాజానగరం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బిక్కవోలు మండల పరిషత్

ఏవోగా ప్రసాద్



ఎంపీపీ సుమను కలిసిన ప్రసాద్

బిక్కవోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ పరిపాలనాధికారిగా వీఎన్ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన రత్నకుమార్ గత నెల 31న పదవీవిరమణ చేయడంతో ప్రసాద్ మండపేట మండల పరిషత్ నుంచి బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా ఆయన ఎంపీపీ తేతలి సుమను,ఎంపీడీవో వి.శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు.

ఇసుక లారీ సీజ్




కోరుకొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని ఎస్ఐ నాగరాజు సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. చర్యలు నిమిత్తం మైన్స్ డిపార్టుమెంట్‌కు అప్పగించారు. కోరుకొండ శివారులో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వైపుకు ఎటువంటి బిల్లులు, అనుమతులు లేకుండా తిరుగుతున్న అక్రమ ఇసుక లారీని డ్రైవర్‌తో పాటు అదుపులోకి తీసుకున్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: థగ్ లైఫ్
సూర్యమినీ	: బల్లెరినా
సూర్యప్యాలస్	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
స్వామి	: ది హంటర్, శ్రీశ్రీశ్రీ రాజా వారు
శివజ్యోతి	: కట్టప్ప జడ్జిమెంట్, పాపా
అనుశ్రీ(సాయికృష్ణ)	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
రాజా	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
ఊర్వశి	: అందాల రాక్షసి
రంభ	: ఫైనల్ డెస్టినేషన్
మేనక	: శుభం, పాడేరు 12వ మైలురాయి
అప్సర	: సింగిల్
కుమారి	: ----
అశోక	: భైరవం
వీఎస్ మహల్(నామవరం)	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
వెంకటసూర్య(కడియం)	: హౌ టు ట్రెయిన్ యువర్ డ్రాగన్
సత్యగౌరి (అనపర్తి)	: థగ్ లైఫ్
సూర్యశ్రీ (అనపర్తి)	: భైరవం
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: థగ్ లైఫ్
రామకృష్ణ(కోరుకొండ)	: ఏస్
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఏస్
శ్రీనివాస (గోకవరం)	: థగ్ లైఫ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: భైరవం
లలితామహల్(రంపచోడవరం)	: థగ్ లైఫ్
నవయుగ(చింతూరు)	: ----

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





స్టాప్ డయేరియా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

డయేరియా అరికట్టాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : డయేరియా మరణాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా స్టాప్ డయేరియా ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం స్టాప్ డయేరియా క్యాంపెయిన్ - 2025 పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు.జూలై 31వ తేదీ వరకూ ఈ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ పెద్ద ఎత్తున జరుగుతున్నదన్నారు. ప్రధానంగా ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా మరణాలను పూర్తిగా అరికట్టడమే ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లలు 1,28,495 మంది ఉన్నారని తెలిపారు. డయేరియా పట్ల తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు.



షా..క్యూ..

తల్లికి వందనం స్కీమ్‌కు విద్యుత్ షాక్ కొట్టింది.. ఆ షాక్ సరిచేసుకునేందుకు పలువురు తల్లులు క్యూకట్టారు. ఇటీవల కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో తల్లుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేసిన సంగతి తెలిసిందే. అయితే కొంతమందికి కరెంట్ బిల్లు 300 యూనిట్లు దాటడంతో డబ్బులు జమ కాలేదు. కరెంట్ బిల్లులను సరి చేసుకుంటే తిరిగి తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఆ బిల్లులు సరి చేసుకునేందుకు ఇలా క్యూ కట్టారు. సోమవారం ఒక్క రోజే గోకవరం మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 100 మందికి పైగా విద్యుత్ బిల్లులు సరి చేయించుకునేందుకు వచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. - గోకవరం

కమిషనర్ కేతన్‌గార్గ్ బదిలీ

- ఆకస్మిక ఉత్తర్వులు
- 11 నెలలే బాధ్యతలు
- విశాఖలో నియామకం

8



జలామృత్!

పట్టణాలకు అమృత్ నిధులు



- తీరనున్న తాగునీటి వెతలు
- పట్టణాల్లో ప్రాజెక్టులకు మోక్షం
- ఉమ్మడి జిల్లాకు రూ.867 కోట్లు
- అమృత్ 2.0 పథకంలో మంజూరు
- చామ్ మోడల్‌లో పనులు
- వైసీపీలో నిధులు మళ్లింపు
- మూడు నెలల్లో టెండర్ల పిలుపు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పట్టణాలు,నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుదల, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టుల నిర్వహణకు పుష్కలంగా నిధులు విడుదలయ్యాయి. కేంద్రం అమృత్-2.0 పథకం ద్వారా ఇచ్చిన నిధులు సద్వినియోగపరచుకుంటూ రాష్ట్ర వాటా విడుదల చేస్తూ పనులు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక సంస్థల వాటా విడుదల చేయకపోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వీటన్నింటికి తిరిగి అంచనాలు రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.867.73 కోట్లు నిధులు మంజూరు చేయడంతో మూడు నెలల్లోగా టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

అసలేం చేస్తారు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాగునీటి సరఫరా వ్యవస్థ పురాతనమైనది. దీంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు చోట్ల ప్రస్తుతం ఉన్న తాగునీటి ప్రాజెక్టుల కెపాసిటీ సరిపోవడం లేదు. పెరిగిన జనాభాకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించడం, పైపులైన్ల ఏర్పాటుతో పాటు మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులు, కొత్తగా మురుగునీటి పారుదల నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు కేంద్రం అమృత్ పథకం ద్వారా నిధులు కేటాయిస్తోంది.ఇందులో కేంద్రంతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చడంతో పాటు ఈ ప్రాజెక్టులు అమలయ్యే పట్టణ స్థానిక సంస్థలు తమ వాటా భరించాలి. 15వ ఆర్థిక సంఘం నిధులు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది.

కూటమి ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమృత్-2.0 పథకం నిధులు వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రంతో సంప్రదింపులు జరిపి తమ వాటా విడుదలకు అంగీకారం తెలపడంతో నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రెండు కార్పొరేషన్లు, ఎనిమిది మునిసిపాలిటీలు,మూడు నగరపంచాయతీలకు 867.73 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ వాటర్ యాక్షన్ ప్లాన్ ట్రెంచ్ 1,2 ద్వారా కన్సెషనరీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(చామ్)లో నిర్వహించేందుకు ఆదేశాలివ్వడంతో అన్ని పనులు మూడు నెలల్లోగా ప్రారంభించాలని ఆదేశించింది. పనులు 24 నెలల్లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.ఈ పనులు పూర్తయితే పట్టణాలు, నగరాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడి.ప్రజలకు తాగునీరందుతుందని భావిస్తున్నారు.

వైసీపీలో ఎక్కడివి అక్కడే..

వైసీపీ ప్రభుత్వం అమృత్-2.0 పథకం నిధులు వినియోగించుకోవడంలో పూర్తిగా విఫలమైంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో అమృత్ నిధులు కేంద్రం మంజూరు చేసింది. దీంతో పట్టణాలు,నగరాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి వీలు ఏర్పడుతుందని భావించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోగా కేంద్రం ఇచ్చిన నిధులు ఇతర అవసరాలకు దారి మళ్లించారు. మంజూరైన పనుల్లో కొన్నింటిని మాత్రమే ప్రారంభించారు.వాటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడం,స్థానిక సంస్థల నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవడంతో పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. మెజార్టీ పనులు ప్రారంభమే కాలేదు.

కాకినాడకు రూ.498.16 కోట్లు

కాకినాడ జిల్లాకు రూ. 498.16 కోట్లు విడుదలయ్యాయి. పిఠాపురం పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.57.37 కోట్లు, పెద్దాపురం పట్టణ పరిధిలో నీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.36.21 కోట్లు, తిరుపతిరాజు చెరువు ఆధునీకరణకు రూ.61 లక్షలు, పాత ఆర్టీసీ కాంపెక్స్ సమీపంలోని పెద్ద చెరువు ఆధునీకరణకు రూ.90 లక్షలు, సామర్లకోట పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ. 38.98 కోట్లు, గొల్లప్రోలు పట్టణంలో ఆర్థికంగా వెనుకబడిన కాలనీల తాగునీటి సరఫరా పథకానికి రూ. 2.16 కోట్లు, మంచినీటి చెరువు అభివృద్ధికి రూ.4.10 కోట్లు, తుని పట్టణంలో వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ పథకానికి రూ.15.04 కోట్లు, ఏలేశ్వరం నగరపంచాయతీలో కప్పల చెరువు ఆధునీకరణకు రూ.74 లక్షలు మంజూరయ్యాయి. కాకినాడ నగరంలో తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ. 256.48 కోట్లు మంజూరు కాగా, నగర పరిధిలో మురుగునీటి పారుదల నిర్వహణకు రూ.82.87 కోట్లు, బోట్‌క్లబ్ పార్కు ఆధునీకరణకు రూ.2.70కోట్లు విడుదల చేశారు.

తూర్పునకు రూ. 296.83కోట్లు

రాజమహేంద్రవరం,నిడదవోలు మునిసిపాలిటీలకు రూ.296.83 కోట్లు మంజూరయ్యాయి.రాజమహేంద్రవరంలో మురుగునీటి పారుదలకు రూ.92.78 కోట్లు, వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌కు రూ.95.14 కోట్లు, కంబాలచెరువు ఆధునీకరణకు రూ.3.70 కోట్లు,గంటాలమ్మ చెరువు ఆధునీకరణకు రూ.కోటి,గోదావరి వద్ద పనులకు రూ.7.20 కోట్లు, ఆర్యాపురం ట్యాంకు ఆధునీకరణకు రూ.3.20 కోట్లు విడుదలయ్యాయి. నిడదవోలుకు ధవళేశ్వరం నుంచి గోదావరి జలాల సరఫరాకు రూ.83.82 కోట్లు, నిడదవోలు వీకర్ సెక్షన్ కాలనీ తాగునీటి సరఫరాకు రూ5.96 కోట్లు, మలకోడు చెరువుకు రూ.93 లక్షలు,వేస్ట్ వాటర్ ట్యాంకు ఆధునీకరణకు రూ. 3.60 కోట్లు మంజూరు చేశారు.

కోనసీమకు రూ.72 కోట్లు

కోనసీమ జిల్లాకు రూ.72.74 కోట్లు కేటాయించారు.అమలాపురం వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ. 11.51 కోట్లు, రామచంద్రపురం తాగునీటి సరఫరా మెరుగుదల ప్రాజెక్టుకు రూ.15.20 కోట్లు, రామచంద్రపురంలో చెరువు ఆధునీకరణకు రూ.1.10 కోట్లు,మండపేట వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టుకు రూ.29.02 కోట్లు, ముమ్మిడివరంలో తాగునీటి సరఫరా మెరుగుదలకు రూ.15.91 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

పింఛన్.. టెన్షన్!



స్పౌజ్ పింఛన్లకు ఎదురుచూపులు

- ఈ నెల 12న ఇస్తారని వాయిదా
- పంపిణీపై అయోమయం
- 8,541 మందికి అర్హత
- పంపిణీకి రూ.3.41 కోట్లు
- ఉమ్మడి జిల్లాలో ఇదీ లెక్క

సామర్లకోట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏం చేసినా అందులో ఒక పరమార్థం ఉంటుంది.లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటున్నారు. సూపర్ సిక్స్ హామీల అమల తీరులోనూ ఇదే విధానం అవలంబిస్తున్నారు. ఏ పథకమైనా నిరంతరం కొనసాగాలనే దిశగా ఆలోచన చేస్తున్నారు. స్పౌజ్ పింఛన్ల పంపిణీది అదే పరిస్థితి. 2023 డిసెంబరు నెల ఒకటో తేదీ తర్వాత భర్త చనిపోతే భార్యకు ఎన్టీఆర్ భరోసా పథకం స్పౌజ్ పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 8,541 కొత్త పింఛన్లు మంజూరు చేశారు.ఈ నెల మొదటి వారంలోనే వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల 12వ తేదీకి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటడంతో స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తారని ప్రకటించారు. అయితే వాయిదా పడింది.ఇప్పటి వరకూ కొత్త పింఛన్ల పంపిణీ చేపట్టలేదు.భర్త చనిపోయిన భార్యకు మాత్రమే వితంతు పింఛను ఇవ్వాలని నిర్ణయించింది.ఎప్పుడిస్తారో ప్రకటించలేదు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత ప్రభుత్వంలో పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే ఆ పింఛన్‌ను భార్యకు మంజూరు చేసేందుకు నెలల సమయం తీసుకునేది. ఏళ్లు గడుస్తున్నా ఆ కుటుంబంలోని భార్యకు లేదా ఇతర అర్హులైన బంధువులకు పింఛన్ మంజూరయ్యేది కాదు.. ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వంలో పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే ఆ మరుసటి నెల నుంచే భార్యకు ఫించన్ ఇస్తున్నారు.2023 డిసెంబర్ ఒకటో తేదీ తరువాత నుంచి భర్త చనిపోయినవారికి కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసింది.



8,541 మంది ఎంపిక..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 8,541 మందికి కొత్తగా ఈనెల నుంచి పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వీరికి నెలకు రూ.4 వేల చొప్పున రూ.3 కోట్ల 41 లక్షల 24 వేలు ప్రతినెలా ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది.ఇలా రాష్ట్రవ్యాప్తంగా 89,788 మంది వితంతువులకు ఈ నెల 12న పంపిణీ చేయాల్సిన పింఛన్లు అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది.ఈ నెలలోనే లబ్ధిదారులకు అందజేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. కాకినాడ జిల్లాలో 3,118 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు చేయగా రూ.1కోటి 24 లక్షల 72 వేలు మేర అదనపు భారం పడనుంది.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 2,824 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా రూ.1 కోటి 12 లక్షల 56 వేలు అదనపు భారం పడనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 2,599 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరు కాగా రూ.1కోటి 3 లక్షల 96 వేలు అదనపు భారం పడనుంది.



వృత్తి నిపుణుల సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి

బీజేపీలోకి వస్తే ఆహ్వానిస్తాం

- ఏపీ అభివృద్ధికి కేంద్రం సాయం
- వికసిత్ భారత్ 2047 లక్ష్యం
- కొవ్వూరు - భద్రాచలం రైల్వే లైన్ ఓకే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా బీజేపీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు లోబడి పనిచేయడానికి సిద్ధంగా ఉంటే వారిని పార్టీలోకి ఆహ్వానిస్తాం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పనుల్లో కదలిక మొదలైందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ స్వప్నానికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ భాగం కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఆంధ్రరాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. అమరావతి రాజధాని కోసం ప్రపంచబ్యాంకు ద్వారా రూ.15 వేల కోట్లు, హడ్కో ద్వారా రూ.11 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం సమకూర్చడం జరిగిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అసత్యమన్నారు. లాభాల్లోకి తేవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సౌత్‌కోస్టల్ రైల్వే డివిజన్ వైజాగ్ హబ్‌గా త్వరలో ఏర్పాటు కానుందన్నారు. భద్రాచలం-కొవ్వూరు 151 కిలోమీటర్ల రైల్వేలైను ఇప్పటికే మంజూరైందని, దువ్వాడ - రాజమహేంద్రవరం రైల్వే లైను డబ్లింగ్ చేపట్టడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి కాశీ, బెనారస్, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు విమాన సర్వీసులు నడపాలంటూ ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలిస్తున్నామని అధికారులు చెప్పారన్నారు. ప్రస్తుతం తాను కామన్వెల్త్ ఉమెన్ పార్లమెంట్ ఇండియన్ చాప్టర్‌కు చైర్మన్‌గా, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా ఉన్నానని వెల్లడించారు. ఇటు రాజమహేంద్ర వరం పార్లమెంట్ చూసుకుంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నానన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా రాష్ట్రాలు, జిల్లాలు, నగరాలు, పట్టణాలు, గ్రామాలు సమగ్ర అభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతోనే ప్రధాని మోదీ పాలన చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మన జవాన్ల శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పామన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కేంద్రం ప్రతిపాదించిన నదుల అనుసంధానాన్ని సీఎం చంద్రబాబు అందిపుచ్చుకున్నారన్నారు.సమావేశంలో జీఎస్ఎల్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు, సాయి హాస్పటల్స్ అధినేత కె.విజయకుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జిల్లా ఇన్‌చార్జి భగవాన్,నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, కంటిపూడి సర్వారాయుడు,నర్సిపల్లి హారిక, వీరా వీరాంజనేయులు, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.

పనులు కుంటుబడి!

పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన పనులు

- నాడు 4137 పనులు మంజూరు
- పూర్తయినవి 382 పనులు
- అసంపూర్తిగా మిగిలినవి
- బడుల ఎదురుచూపులు



కొవ్వూరు మునిసిపల్ హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణ పనులు

కొవ్వూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.. విద్యార్థులు తరగతులకు వెళుతున్నారు..కానీ సమస్యలు మాత్రం తీరలేదు..నేటికి తొంగి చూస్తూనే ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ పనులు నేటికీ అసంపూర్తిగా మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మన బడి - మన భవిష్యత్ పథకంలో భాగంగా అసంపూర్తిగా నిలిచిపోయిన పనులపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడల నిర్మాణం, మరుగుదొడ్లు,తాగునీరు, విద్యుద్దీకరణ, పెయింటింగ్, ఇంగ్లీష్ ల్యాబ్ వంటి 9 రకాల పనులు మంజూరు చేసి ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పాఠశాల యాజమాన్య కమిటీల భాగస్వామ్యంతో పనులు చేపట్టారు. అయితే పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో పనులు నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలలకు నిధులు విడుదల చేసినప్పటికి వాటిని ఏవిధం గా ఖర్చు చేయాలని విధివిధానాలు రూపొందించలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

వేసవి సెలవులు పూర్తయినా..

వేసవి సెలవులు పూర్తి కావడంతో గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖ ఆదేశించింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 655 పాఠశాలల్లో రూ.259.10 కోట్లు అంచనా వ్యయంతో 4137 పనులు మంజూరు చేశారు. వాటిలో రూ. 131.59 కోట్లు ఖర్చు చేసి 382 పనులు పూర్తి చేశారు. 2903 పనులు వివిధ దశల్లో నిలిచిపోయాయి.852 పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కొవ్వూరు మండలంలో 34 పాఠశాలల్లో రూ.11.12 కోట్లు అంచనా వ్యయం తో 194 పనులు మంజూరు చేశారు. వాటిలో 163 పనులు ప్రారంభించారు. గతేడాది కాలంగా అవి వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. ఇంకనూ 31 పనులు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. పనులు చేపట్టడానికి నిధులు విడుదల కాకపోవడంతో 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్‌కు 6 నెలల ముందు నుంచే పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలో అయినా అసంపూర్తి పనులకు నిధులు మంజూరు చేసి 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేస్తారని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు భావించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో నిలుపుదల చేసిన పనులకు త్వరితగతిన నిధులు మంజూరుచేసి పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమస్య వింటున్న డీఆర్‌వో సీతారామమూర్తి

పీజీఆర్ఎస్‌కు 177 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 177 అర్జీలు స్వీకరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన పీజీఆర్ఎస్‌లో డీఆర్‌వో టి.సీతారామమూర్తి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు 1100 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు.గోకవరం మండలం గాదెలపాలెం గ్రామంలో ఇసుకపల్లి చెరువు గట్టుపై అక్రమ నిర్మాణాలు , రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేటలో వీధి దీపాలు పనిచేయడంలేదని,ధవళేశ్వరం గ్రామంలో భూసమస్య ,పెరవలి మండలం కాపవరంలో భూమి రీసర్వే చేయాలని అర్జీలు వచ్చాయి.

డీపీవోలో గ్రీవెన్స్‌కి 23 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు ప్రజల నుంచి 23 ఫిర్యాదులు స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు.

వయసు 33 చోరీలు 80

- అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు
- పోలీసుల అదుపులో ఇద్దరు
- 43 లక్షల సొత్తు స్వాధీనం
- సిబ్బందికి ఎస్పీ ప్రశంస

రాజమహేంద్రవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : చోరీలు చేయడంలో అతను సిద్ధహస్తుడు.. ఎందుకంటే..అతని వయసు 33.. చోరీలు 80... అంతర్రాష్ట్ర దొంగగా ముద్ర.. ఇదీ విశాఖ పట్నం జిల్లా గాజువాక మండలం సింహగిరి కాలనీకి చెందిన బులా నాగసాయి నేరచరిత్ర..17 ఏళ్ల వయసులోనే చోరీల బాటపట్టాడు.. చోరీలు చేయడంలో ప్రావీణ్యత సాధించాడు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్ పోలీసులు అంతర్రాష్ట్ర దొంగ ఆటకట్టించారు.సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్ బాబు సోమవారం వివరాలు వెల్లడించారు. పలు కేసుల దర్యాప్తులో భాగంగా పాత నేరస్తుల చిట్టావిప్పితే అందులో బులా నాగసాయిపై అనుమానం వచ్చిందన్నారు.ఈ మేరకు అతని స్నేహితుడు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన మహ్మద్ సోనూ ఆలీ అహ్మద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడిందన్నారు. బులా నాగసాయి 2007 నుంచీ దొంగతనాలు చేస్తున్నాడని తెలిపాడన్నారు. నాగసాయి దొంగిలించిన సొత్తును అహ్మద్‌ఖాన్ కొనుగోలు చేయడం, దొంగతనాల్లో సహకరించడం చేస్తాడన్నారు. నిందితుడిపై గాజువాక, వైజాగ్, రాజమహేంద్రవరం, కడప, నెల్లూరు, ఒంగోలు, అత్తిలి, తణుకు, తాడేపల్లిగూడెం, కావలి, బెంగళూరు ప్రాంతాల్లో 80 దొంగతనం కేసులు ఉన్నాయన్నారు. గాజువాక పీఎస్‌లో సస్పెక్ట్ షీట్ ఉందన్నారు.ఇటీవల రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో నాగసాయి, అహ్మద్ ఖాన్‌ని సోమవారం అరెస్టు చేసి సుమారు రూ.43 లక్షలు విలువైన 465 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదించిన సీఐ ఆర్ఎస్‌కే బాజీలాల్,ఎస్ఐ జి.సతీష్, హెచ్‌సీ వి.నాగరాజు, క్రైమ్ పీసీలు కె.ప్రదీప్ కుమార్,ఎస్.వీరబాబు, వి.దుర్గాప్రసాద్, వి.శివప్రసాద్‌లను ఎస్పీ అభినందించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు తీసుకుంటున్న తహశీల్దార్ అచ్యుత కుమారి

పీజీఆర్‌ఎస్‌లో 15 అర్జీలు స్వీకరణ

కొవ్వూరు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీ ఆర్‌ఎస్ మీకోసం కార్యక్రమంలో 15 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ అచ్యుత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేదిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. డివిజన్ అధికారులు పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు తమ అర్జీలను 1100 మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు నమోదు చేయుటకు, నమోదైన మీఅర్జీ యధార్థస్థితి గతులు తెలుసుకోవచ్చని తెలిపారు. డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యువత యోగా సాధనపై

మక్కువ పెంచుకోవాలి

● రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ



యోగా చేస్తున్న రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఉద్యోగులు



వేగేశ్వరపురం పాఠశాల ప్రాంగణంలో యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు



ఆంధ్రాగీర్వాణీ విద్యాపీఠంలో పట్టణ ప్రజల యోగాసనాలు

రాజమహేంద్రవరంసిటీ, జూన్16(ఆంధ్ర జ్యోతి): భారతీయ సనాతన సంపదైన యోగా ను తమ జీవన శైలిలో భాగంగా చేసుకోవాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్సుకళాశాలవద్ద సోమవారం ఉదయం 6గంటలకు నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన నగరపాలక సంస్థ ఉద్యోగులు పాల్గొని యోగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర-2025ను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా నేటి యువత యోగా సాధనపట్ల మక్కువ పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ సెక్రటరీ శైలజావల్లి, ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరావు, మేనేజరు అబ్దుల్‌మాలిక్, సీఎంఎం రామలక్ష్మి, అకౌంటెంట్ రమణరావు, ఆర్వో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రాగీర్వాణీ విద్యాపీఠంలో..

కొవ్వూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రా క్యాంపైన్ 2025లో భాగంగా కొవ్వూరు పట్టణంలోగల ఆంధ్రా గీర్వాణీ విద్యాపీఠంలో సోమవారం ఉదయం మాస్టర్ ట్రైనీ పెనుమత్స సరోజనీ, గోవుగౌతమీ గోదావరి పరిరక్షణ సమితి కన్వీనర్ వై కె.శ్రీనివాసరావు యోగాపై పట్టణ ప్రజలకు శిక్షణ, అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీరామ కిషోర్, స్కూల్ అసిస్టెంట్ కె.సౌజన్య, సచివాలయ సిబ్బంది, ము న్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో యోగా మాక్ డ్రిల్

తాళ్లపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం యోగా మాక్ డ్రిల్ కార్యక్రమం తహసీల్దార్ లక్ష్మా లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రామచెల్లయ్య, లక్ష్మణకుమార్‌లు విద్యార్థులతో, పలుశాఖల సిబ్బందితో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ యోగాతో ప్రతిఒక్కరికీ ఆరోగ్యం, ఆనందం అభిస్తుందని ప్రతిఒక్కరూ యోగా కోసం కనీసం 30నిమిషాల నుంచి 1గంట వరకూ సమయాన్ని కేటాయించాలని తెలిపారు. జూన్ 21న జరిగే అంర్జాతీయ యోగాడేను విజయవంతం చేయాలనితెలిపారు. కార్యక్రయంలో డిప్యూటీ తహసీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాల పంపింగ్ స్కీమ్ నుంచి

సాగునీరు విడుదల



విజ్జేశ్వరంలో పెండ్యాల పంపింగ్ స్కీమ్ వద్ద నీటి విడుదలకు నీటి సంఘాల అధ్యక్షుల పూజలు

నిడదవోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం విజ్జేశ్వరంవద్ద వున్న పెండ్యాల పంపింగ్‌స్కీమ్ ద్వారా కానూరు ఆయకట్టుకు సోమవారం ప్రత్యేక పూజలుచేసి సాగునీటిని విడుదల చేశారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ అధ్యక్షుడు జుజ్జవరపు సూర్యభాస్కరరావు నీటిని విడుదల చేశారు. పెండ్యాల పంపింగ్ స్కీమ్ ఆయకట్టు ద్వారా నిడదవోలు మండలం గోపవరం, పురుషోత్తపల్లి, కానూరుమీదుగా సుమారు ఏడువేల ఎకరాలకు నీరు అందనుంది. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు జుజ్జవరపు వెంకట సత్యనారాయణ, పెండ్యాల పంపింగ్ స్కీమ్ అధ్యక్షుడు పుల్లా ఆదిశేఖర్, పూటి లక్ష్మి, పాఠంశెట్టి శ్రీనివాసరావు, మారిశెట్టి వెంకట సత్య నారాయణ, నీటిపారుదలశాఖ డీఈ జ్యోతి, ఏఈ పెద్దిరాజు పాల్గొన్నారు.

విద్యుత్‌కు మూడు రోజులు అంతరాయం

పెరవలి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం మూడు రోజులపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు అన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ మల్లేశ్వరం పీడర్ పరిధిలోని మల్లేశ్వరం, కడింపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తారన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజమహేంద్రి మునిసిపల్ కమిషనర్ బదిలీ

గ్రేటర్ విశాఖ కమిషనర్‌గా కేతన్ గార్గ్ నియామకం



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆకస్మిక బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్ నెం 1181ను జారీ చేసింది. కమిషనర్ కేతన్ గార్గ్‌ను గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ స్థానంలో ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక 2024 జూలై 25న అప్పటి కమిషనర్ దినేష్‌కుమార్‌ను గుంటూరుకు బదిలీ చేసి కేతన్ గార్గ్‌కు రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్‌గా కూటమి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. కేతన్ గార్గ్ బాధ్యతలు స్వీకరించి వచ్చే నెలతో ఏడాది పూర్తవుతుంది. ఇప్పటికి 11నెలలు కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2027లో అతి పెద్ద ఈవెంట్ రాజమహేంద్రవరం గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలతో పాటు, ప్లానింగ్ కేతన్ గార్గ్ సిద్ధం చేసుకున్నారు. అయితే గత రెండు నెలలుగా కమిషనర్‌ను బదిలీ చేస్తారనే సమాచారం ఉంది. కాని పుష్కరాల ముందు కమిషనర్ బదిలీ ఉండకపోవచ్చని అందరు భావించారు. మరో పక్క కమిషనర్ కూడా తనదైన శైలిలో రాజమహేంద్రవరంలో పనులు చేపట్టారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆక్రమణల తొలగింపు వేగవంతం చేశారు.సరిగ్గా ఇదే విధానం గతంలో విజయరామరాజు చేపట్టిన నెలలోపు ఆయన కూడా బదిలీ అయ్యారు. ఇప్పుడు అదే తరహాలో కమిషనర్ కేతన్ గార్గ్ బది లీ జరగడం వెనుక.. కమిషనర్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కావొచ్చనే వాదన వినిపిస్తోంది. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, తాగునీటి ఎద్దడిని అధిగమించే యాక్షన్ ప్లాన్ చేయడం, ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలు ఎప్పటికప్పుడు కార్యరూపం దాల్చేలా చేయడం వేగంగానే చేశారు. నగర ప్రజలలో తనదైన ముద్రను వేసుకున్నారు. కేతన్ గార్గ్ బదిలీ కావడంతో ఆ స్థానంలో గతంలో తూర్పుగోదావరి జిల్లాలో పని చేసిన రెండో ఉన్నతాధికారిని నియమించనున్నట్టు తెలిసింది. ఆయన పదోన్నతిపై ముఖ్యస్థానంలో ఉన్నప్పటికి రాజమహేంద్రవరానికి ప్రాధాన్యమిస్తున్నట్టు సమాచారం. అయితే గత ప్రభుత్వంలో చేసిన సదరు అధికారిని కూటమి ప్రభుత్వం అనుమతిస్తుందో లేదో వేచి చూడాలి. కేతన్ గార్గ్ మంగళవారం రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.

వ్యవసాయాధికారిగా రాజారావు బాధ్యతల స్వీకరణ

ఉండ్రాజవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల వ్యవసాయాధికారిగా బి.రాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గోపాలపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విశ్వానరావు తాడేపల్లిగూడెం వ్యవసాయల్యాబ్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రైతులకు సంబంధించిన పథకాలు సక్రమంగా అమలుచేయడంతో తనవంతు కృషి చేస్తానని చెప్పారు. రేపటి నుంచి పొలం పిలుస్తోంది, ఇతర కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ సరఫరాలో మార్పు

నల్లజర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం సబ్‌స్టేషన్ నుంచి నబీపేటకు 11కేవీ విద్యుత్ లైన్ నిర్మాణం కారణంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయం మా ర్పుచేసినట్లు విద్యుత్ ఈఈ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నబీపేట ఫీడర్‌కు వ్యవసాయ విద్యుత్ ఉదయం 4గంటల నుంచి 10గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటలవరకు ఉంటుందన్నారు. రైతులు సహ కరించాలని కోరారు.

93 మందికి కంటి పరీక్షలు

ఉండ్రాజవరం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరంలోని బౌద్ధధమ్మపీఠంలో సోమవారం వేమగిరికి చెందిన పరమహంస యోగ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 93 మంది రోగులకు కంటిపరీక్షలు జరిపి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వీరిలో 32మందికి కళ్లజోళ్లు వేయడానికి, 28మందికి కంటిఆపరేషన్లు చేయడానికి గుర్తించారు. కార్యక్రమంలో బౌద్ధధమ్మ పీఠం అధిపతి అనాలయో, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారాతో అరెస్టు

దేవరపల్లి, జూన్16 (ఆంధ్రజ్యోతి): నాటుసారా, మద్యం అక్రమ అమ్మకాలు జరిపితే కఠినచర్యలు తప్పవని దేవరపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు సోమవారం హెచ్చరించారు. మండలంలో ఆకస్మిక దాడులు నిర్వహించగా కృష్ణంపాలెం గ్రామంలో నాటుసారా అమ్మకాలు జరుపుతున్న కడలి శ్రీనివాస్‌ను అరెస్టుచేసి అతని వద్ద నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దేవరపల్లి, జూన్16 (ఆంధ్రజ్యోతి): మోటర్‌సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని దుద్దుకూరు జాతీయ రహదారి వద్ద సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన కొర్లపాటి వెంకట్రమణ మోటర్ సైకిల్‌పై కొవ్వూరు వైపు నుంచి స్వగ్రామం చెరుకుమిల్లి వెళతుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో వెంకట్రమణ కుడికాలికి తీవ్రగాయమైంది. వెంటనే హైవే పెట్రోలింగ్ ఏఎస్ఐ భూషణం క్షతగాత్రులను 108వాహనంపై తరలించారు. రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని దీని పై ఫిర్యాదు రాలేదని ఎస్ఐ తెలిపారు.

బిక్కవోలు మండల పరిషత్ ఏవోగా

ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

బిక్కవోలు, జూన్ 16(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ పరిపాలనాధికారిగా వీఎస్‌ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రత్నకుమార్ పదవీ విరమణ చేయడంతో ప్రసాద్ మండపేట మండల పరిషత్ నుంచి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన ఎంపీపీ తేతలి సుమను, ఎంపీడీఓ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

సనాతన ధర్మ పరిరక్షణకే పాదయాత్ర

● కాశీ నుంచి కన్యాకుమారికి ఇస్కాన్ మహా పాదయాత్ర



చీపురుగూడెంలో ప్రారంభించిన పాదయాత్ర

నల్లజర్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మం పరిరక్షిం చేందుకు కాశీ నుంచి కన్యా కుమారి వరకు 7వ పర్యాయంగా సాగుతున్న మహాపాదయాత్ర తెలికిచర్ల మీదుగా సోమవారం చీపురుగూడెం చేరుకుంది. పాదయాత్ర నిర్వాహకుడు బద్రీ బలరామ్‌దాస్ మాట్లాడుతూ భారతదేశంలో అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ 1984లో ప్రారంభమైన మహాపాద యాత్ర 6పర్యాయాలు పూర్తి చేసుకుని 7వ పర్యాయం ప్రారంభించినట్లు చెప్పారు. భారతదేశంలో భక్తులకు కృష్ణుడి విశిష్టత తెలుపుతూ నగర సంకీర్తనలుచేస్తూ పాదయాత్ర సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో పాదయాత్రగా వస్తున్న మమ్ములను ఎంతో ప్రేమగా స్వాగతం పలుకుతూ అన్ని సదుపాయాలు కల్పిస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం కంపన దుర్గారావు ఇంటివద్ద పాదయాత్ర చేస్తున్న సభ్యులకు భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదం అందించారు. కూసంపూడి వెంకటేశ్వరరావు (బుజ్జి) గుళ్ళపూడి వెంకటరత్నం, తలంశెట్టి మురళీ, వరలక్ష్మి, కొత్తపల్లి హరిబాబు, గుళ్ళపూడి గణేశ్, చెల్లు రాంబాబు, బాబురావు, శివయ్య, చెల్లు నాయుడు పాల్గొన్నారు.

గోపాలపురం ఏఎస్‌వోగా వెంకటేశ్వరరావు



తహసీల్దార్ విజయ్‌బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు

గోపాలపురం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గోపాలపురం సహాయ గణాంక అధికారి (ఏఎస్‌వో)గా జోడాల వెంకటేశ్వరరావు పదవీ బాధ్యతలు చేట్టారు. ఆయన తాళ్లపూడి నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన జోడాల మర్యాదపూర్వకంగా తహసీల్దార్ అజయ్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. జోడాల మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్లో పంటకోత ప్రయోగాలు, మైనర్ ఇరిగేషన్ సెషన్స్, జనాభాలెక్కలు, విజన్ 2047 వంటి కార్యక్రమాలు విజయవంతంగా చేసేందుకు కృషిచేస్తానని ఆయన తెలిపారు.

తహశీల్దార్‌ను కలిసిన అధికారులు, నాయకులు



తహశీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన లక్ష్మీ లావణ్యను పలువురు అధికారులు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ తహసీల్దార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం రేషన్‌షాపు డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పట్టపు బూలా స్వామి, మండల తెలుగు యువత నాయకులు నా మానురేంద్రలు తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

దివ్యాంగులకు రోబోటిక్ అవయవాలు అందజేత



కృత్రిమ అవయవాలు అమర్చిన దివ్యాంగులు

కొవ్వూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిడిపి దేవేక్తి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో 60 మంది దివ్యాంగులకు రోబోటిక్ అవయవాలను ఉచితంగా అందించారు. విజయవాడ, మంగళగిరి రోటరీక్లబ్‌ల సహకారంతో ఉభయగోదావరి జి ల్లాలకు సంబంధించిన 60 మంది దివ్యాంగులను విజయవాడ తీసుకుని వెళ్లి కొలతలు ఇప్పించి రోబోటిక్ అవయవాలను అందించామని తెలిపారు. వారి ప్రయాణానికి రెండు బస్సులకు ఆర్థిక సహాయాన్ని అందించిన ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరావు ఆయన మిత్రబృందం ప్రవీణ్, బాబు తదితరులు సహాయం అందించారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రత్తిపాటి నాగరాజు, ప్రభాస్‌లు పాల్గొన్నారు.

అమ్మా.. ఎలాగున్నారు?



వృద్ధురాలి బాగోగులు ఆరా తీస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ జీవకారుణ్య సంఘఆవ రణలోని వృద్ధాశ్రమాన్ని సోమవారం సందర్శిం చారు. వృద్ధులతో మాట్లాడి బాగోగులపై ఆరా తీశారు. వసతులు, సదుపాయాలు, ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం సన్‌షైన్ బాయ్స్ హోమ్, ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాలను సందర్శించి వసతులను గమనించారు. క్రమశి క్షణ, సహనం మనిషికి ఉండాల్సిన ప్రధాన లక్షణాలని, చెడుస్నేహాలకు, అలవాట్లకు దూరంగా ఉండాలని పిల్లలకు చెప్పారు. న్యాయ సహాయం అవసరమైతే డీఎల్ఎస్ఏని సంప్రదించాలని బాలలకు, వృద్ధులకు సూచించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగ



తుప్పలతో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

దేవరపల్లి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు, విద్యుత్ స్తంభానికి తీగ అల్లుకుపోవడంతో ప్రమాద భరితంగా మారింది. చిన్నాయిగూడెం గ్రామంలో రహదారి పక్కన ఈతీగ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకోవడం, విద్యుత్ తీగలకు ఎగబాకటంతో ఈ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడటం పశువులు ఈ రోడ్డు మార్గంగుండా వెళ్లినప్పుడు ఆ తీగల ఆకులను తింటున్న విద్యుత్ సరఫరా అయ్యి చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో పాటు ఊరికి సమీపంలో ఉండటం వలన పిల్లలు ఎవరైనా ఆ తీగలకు తగిలితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వెంటనే తీగలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు నెరవేర్చాలని

భవన నిర్మాణ కార్మికుల ధర్నా



నిడదవోలు కార్మికశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

నిడదవోలు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయంవద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 2019-24 మధ్య దారి మళ్లించిన కార్మిక సంక్షేమ మండలి నిధులను తక్షణమే వెనక్కి రప్పించేలా కూటమి ప్రభుత్వం కృషిచేయాలన్నారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు, పథకాలు పునరుద్ధరి ంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీన చలో విజయ వాడకు పిలుపునిచ్చామన్నారు. ఈ ధర్నాలో పామర్తి సత్యనారాయణ, ఖండవల్లి వీరవెంకటరావు, రవ్వా సురేష్‌కుమార్, సురేష్, రమేష్ పాల్గొన్నారు.

సంచారవాసులకు దోమతెరలు పంపిణీ

నల్లజర్ల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలో పలు గ్రామాల్లో గుడిసెలు వేసుకుని జీవించేవారికి, సంచార జీవుల కు ఆమెన్ ట్రస్ట్ దోమ తెరలు అందించి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించింది. సోమవారం నల్లజర్ల ఉప్పర్ల కాలనీ, దూబచర్ల-కొత్తగూడెం కాలనీ, గ్రామాల శివారులో ఉండే చెంచు ల వద్దకు ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఇవాంజలిన్, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి.ప్రసాద్ వెళ్లివారి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవ డం ద్వారా కలిగే ప్రయోజనాలు, మురిగివాడల్లో ఎలా జీవించాలో, వర్షాకాలంలో వచ్చే వాధ్యులు, నీరు నిల్వ లేకు ండా చూసుకోవడం, కాచి చల్లార్చిన నీరు తీసుకోవడం వంటి ఆరోగ్య సూత్రాలు తెలియజేసి వారికి దోమతెరలు అందించి వాటిని ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలిపారు. దోమల ద్వారా వచ్చే వాధులను తెలియజేశారు.



దూబచర్ల శివారు ప్రాంతంలో సంచార వాసులకు దోమ తెరలు